



పేట్టుబడి పంతులయ్యారు..!

కోటి ఆశలతో లక్షలాది మంది నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఎదురుచూశారు.. నోటిఫికేషన్ రానే వచ్చింది.. అహర్నిశలు శ్రమించారు.. రోజుకు పది నుంచి 12 గంటల పాటు పుస్తకాలతో కుస్తీ పట్టారు.. గురువులుగా ఎదగాలనే లక్ష్యంతో ముందుకు సాగారు.. పరీక్షలు రాసి ఇక ఫలితాల కోసం పడిగాపులు కాశారు.. వారి కలలు నెరవేరే సమయం ఆసన్నమైంది.. వారి కష్టానికి తగ్గ ఫలితం దక్కే ఘడియలు రానే వచ్చాయి. శనివారం ఎందరో నిరుద్యోగుల జీవితాల్లో ఉద్యోగ వెలుగులు వెలిగాయి. డీఎస్సీ ఫలితాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. అభ్యర్థికి వచ్చిన మార్కులు, మెరిట్ జాబితాలో వారి పేరు ఏస్థాయిలో ఉంది..? ఉద్యోగం వస్తుందా.. రాదా..? అని అభ్యర్థులు నిర్ధారణకు వస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5.77 లక్షల మంది నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు దరఖాస్తులు చేస్తే, ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే 53,787 మంది దరఖాస్తు చేయడం కొసమెరుపు. ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. వారి కుటుంబాలు, బంధువులు, సన్నిహితులు హర్షం వ్యక్తం చేశారు.

- మెగా డీఎస్సీ-2025 మెరిట్ జాబితా విడుదల
- త్వరలో నియామక ప్రక్రియ పూర్తి.. పాఠశాలలకు కేటాయింపు
- జిల్లాలో 2,645 ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ
- టాపర్-1, 2లో వివిధ విభాగాల్లో 42 మంది అభ్యర్థులు
- సర్టిఫికెట్ల పరిశీలనకు డిప్యూటీ డీఈవో, ఎంఈవోలకు శిక్షణ
- ఎన్నికల హామీ నిలుపుకున్న కూటమి ప్రభుత్వం
- రేపటి నుంచి ధ్రువీకరణ పత్రాలు పరిశీలన

కర్నూలు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో భాగంగా మెగా డీఎస్సీ-2025 పక్కా ప్రణాళికతో నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వివిధ విభాగాల్లో 2,645 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలో అత్యధికంగా ఖాళీలు ఇక్కడే ఉండడంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన నిరుద్యోగ ఉపాధ్యాయులు నాన్‌లోకల్ కేటగిరిలో అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి దరఖాస్తులు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం శనివారం మెరిట్ జాబితాను విడుదల చేశారు. కష్టపడి చదివిన వారు ఉద్యోగాలు సాధించారు. మెరిట్ జాబితాను డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్లో పెట్టారు. అన్ని సబ్జెక్టులకు రాష్ట్ర, జోన్, జిల్లాల వారీగా ర్యాంకులు ఇచ్చారు. జిల్లాలో 53,787 మంది అభ్యర్థులు డీఎస్సీ రాశారు. వారికి వచ్చిన మార్కులు ఆధారంగా మెరిట్ జాబితాను విడుదల చేశారు. త్వరలో పాఠశాలలకు కొత్త గురువు వస్తున్నారు. వివిధ సబ్జెక్టుల వారీగా వచ్చిన మార్కులు పరిశీలిస్తే జిల్లాలో టాపర్-1గా నిలిచిన అభ్యర్థులు అత్యధికంగా 64.22 - 87.34 మార్కులు సాధించారు. ఆఖరులో నిలిచిన అభ్యర్థులకు అత్యల్పంగా సాంఘిక శాస్త్రంలో 18.56 మార్కులు, స్కూల్ అసిస్టెంట్ కన్నడలో 43.27 మార్కులు వచ్చాయి. వివిధ కేటగిరి రిజర్వేషన్లు ప్రకారం స్థానిక (లోకల్) అభ్యర్థులకు కటాఫ్ మార్కులు 64.06395 నుంచి 79.60427 పైబడి మార్కులు వచ్చిన అభ్యర్థులకు, స్థానికేతర (నాన్ లోకల్) అభ్యర్థులు 70.56513 నుంచి 87.00531 మార్కులకు పైగా వచ్చిన అభ్యర్థుకు ఉపాధ్యాయ ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. మెరిట్ జాబితాలో పేర్లు, మార్కులు, ర్యాంకులు చూసి తమకు ఉద్యోగం ఖాయం అని భావించే అభ్యర్థులు, వారి ఇళ్లలో సంబరాలు జరుపుకుంటున్నారు.

మిగతా 5వ పేజీలో

ఉమ్మడి కర్నూలు జిల్లాలో డీఎస్సీ-2025లో వివిధ విభాగాల్లో జిల్లా టాపర్-1, 2 విజేతలు, వారికి వచ్చిన మార్కులు

విభాగం	టాపర్-1	మార్కులు	టాపర్-2	మార్కులు
స్కూల్ అసిస్టెంట్ (లాంగ్వేజ్)				
ఇంగ్లీష్	ఆర్. సాయినవీన్	85.89	కోనంగి రమేష్‌బాబు	85.19
హిందీ	నసీరుద్దీన్ ముల్లా	82.37	ఎస్.సుశీల	80.50
కన్నడ	బాలకుండి మాకన్న	78.57	వడ్డె నాగరాజ	74.33
సంస్కృతం	కల్లూరు జమల్	67.13	బి.శ్రీహరికృష్ణ	60.57
తెలుగు	కల్లె మహేశ్‌బాబు	85.62	మధుసూదన్ అంగజల	84.40
ఉర్దూ	సబిహా బేగం	85.13	ఇస్మాయిల్ బాషా	85.00
స్కూల్ అసిస్టెంట్ (నాన్ లాంగ్వేజ్)				
బయోలాజికల్ సైన్స్	వడుగూరు నాగరాజు	85.67	బాలస్వామి నందల	85.62
కన్నడ మీడియం	పూజారి చాముండి	68.80	అంబికా ఆర్	65.80
ఉర్దూ మీడియం	ఎం. మహ్మద్ ఫయాజ్	74.37	బీఎస్ తబస్సుమ్	73.00
లెక్కలు	వి.వెంకటరామిరెడ్డి	85.18	జంగం జ్యోతిరాంప్రసాద్	84.43
కన్నడ మీడియం	కురువ శివశంకర్	72.60	డ్యాన్ హెచ్‌డీ	63.33
ఉర్దూ మీడియం	షేక్ అఫిజాబీ	64.22	కలగట్ల గయాబ్‌వలి	64.13
ఫిజికల్ సైన్సు	వెంకటశివారెడ్డి	81.04	బి.వెంకట చిరంజీవి	79.27
కన్నడ మీడియం	భీమప్ప	66.40	కురువ శివశంకర్	59.60
సోషియల్ స్టడీస్	చాకలి పరుశరాముడు	87.34	గొల్ల కోదండరాముడు	86.07
కన్నడ మీడియం	తలురు స్వాతి	70.83	మాన్వి హనుమంత	61.47
ఉర్దూ	బండెగేరి బషిరున్	69.23	షేక్ మోమినా	67.40
సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్‌జీటీ)				
ఎస్‌జీటీ	బొల్లం లావణ్య	94.53	కమలపాడు శారద	93.27
కన్నడ మీడియం	మూలెమనె నన్నేఖాశీం	73.93	రౌడూరు ఇస్మాయిల్	71.60
ఉర్దూ మీడియం	షేక్ రోష్ని	78.03	షేక్ జంరుద్‌బీ	77.57
టీజీటీ ఇంగ్లీష్	కాలహస్త్రి గౌతమి	83.32	షేక్ సమీర్‌బాషా	82.98

స్టేట్ ర్యాంకుతో మెరిసిన మహేష్‌బాబు

● మూడు పోస్టులతో రాణించిన పేదింటి ఆణిముత్యం



కల్లూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో కర్నూలు జిల్లా కల్లూరు మండలం పెద్దపాడుకు చెందిన పేదింటి ఆణిముత్యం కల్లె మహేష్‌బాబు స్టేట్ ర్యాంకుతో సత్తాచాటాడు. పెద్దపాడుకు చెందిన సాధారణ కూలీ వెంకటేశ్వర్లు, పార్వతమ్మలకు ముగ్గురు కుమారులు. పెద్దవాడైన కల్లె మహేష్‌బాబుకు చదువుపై ఉన్న మక్కువను గుర్తించిన తల్లిదండ్రులు రోజూకూలీగా పని చేస్తూ ఉన్నతంగా చదివించారు. పట్టుదలతో డీఎస్సీ రాసిన మహేష్‌బాబు ఏకంగా మూడు పోస్టులకు ఎంపికయ్యాడు. టీజీటీ తెలుగు స్టేట్‌ఫస్ట్ ర్యాంక్ 85.20 మార్కులు, పీజీటీ ఫోర్త్ జోన్ ఫస్ట్ ర్యాంక్ 84 మార్కులు, కర్నూలు జిల్లా స్కూల్ అసిస్టెంట్ తెలుగు జిల్లా ఫస్ట్ ర్యాంక్ 85.62 మార్కులతో అత్యున్నత ప్రతిభ కనబరిచారు. కష్టానికి తగిన ఫలితం వచ్చినందుకు ఆనందంగా ఉందని మహేష్‌బాబు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ విజయంలో తల్లిదండ్రుల పాత్ర చాలా ఉందని, చెమటోర్చి తనను చదివించిన అమ్మానాన్నల రుణం తీర్చుకుంటానన్నారు. అదేవిధంగా రాయలసీమ యూనివర్సిటీ తెలుగు డిపార్ట్‌మెంట్‌లో పీహెచ్‌డీ స్కాలర్ (జేఆర్ఎఫ్) తోడ్పాటు, తెలుగు డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ ఎస్.నరసింహులు ప్రోత్సాహం మరువలేనని కల్లె మహేష్‌బాబు సంతోషం వ్యక్తం చేశారు.

శభాష్ లావణ్య..

● డీఎస్సీలో జిల్లా ఫస్ట్ ర్యాంకు

తుగ్గలి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తండ్రి పుల్లయ్య తన చిన్నప్పుడే చనిపోవడంతో తల్లి కృష్ణవేణి కూలీ పనులు చేస్తూ చదువు చెప్పడంతో.. విద్యాబుద్ధులు నేర్పి సరస్వతిగా తీర్చిదిద్ది విద్యనందించే గౌరవ ఉపాధ్యాయురాలుగా సేవలందించేందుకు డీఎస్సీ ఎస్జీటీలో లావణ్య జిల్లా ఫస్ట్ ర్యాంకు సాధించింది. అందరితో శభాష్ అనిపించుకుంటుంది. మాజీ సర్పంచ్ వెంకటస్వామి, మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖ్ యాదవ్‌తో పాటు పలువురు లావణ్యను అభినందించారు.

నాన్న కోరిక మేరకు ఉపాధ్యాయ వృత్తి చేపట్టా

తాను 7వ తరగతి చదువుతున్న సమయంలో నాన్న అకాల మరణం చెందారు. అమ్మ కూలీ పనులు చేస్తూ తనను, చెల్లెలు, తమ్ముడిని చదివించింది. నాన్న కోరిక మేరకు ఉపాధ్యాయ వృత్తి చేపట్టాలనే ఆకాంక్షతో ఎంతో కష్టపడి చదివి విజయం సాధించా. 2020లోనే టీటీసీ పూర్తి చేశా. ఉన్నత చదువుల కోసం గురువులు ఆర్థికసాయం అందించారు. వారి రుణం తీర్చుకోలేనిది. భవిష్యత్తులో పేద విద్యార్థులకు అండగా ఉంటా. వారి విద్యాభివృద్ధికి కృషి చేస్తా.



● లావణ్య, ఎస్‌జీటీ, జి.ఎర్రగుడి

రాయలసీమ పరిరక్షణ సమితి పార్టీకి ఎన్నికల సంఘం షోకాజ్ నోటీసు

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రాయలసీమ పరిరక్షణ సమితి పార్టీ ఆరేళ్ల నుంచి ఎలాంటి ఎన్నికల్లో పోటీ చేయలేదని తెలియజేస్తూ ఏపీ రాష్ట్ర ఎన్నికల సంఘం షోకాజ్ నోటీసు ఇచ్చింది. 148-పాణ్యం నియోజకవర్గం కల్లూరు మండలంలోని డోర్ నెంబర్ 70-125-బి-71, నియర్ హైవే, కల్లూరు, కర్నూలు నగరం-518003లో ఉన్న పార్టీ కార్యాలయంలో కోశాధికారి అయిన వేముల సుధాకర్‌కు కల్లూరు తహసీల్దార్ ద్వారా అందజేసినట్లు కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. ఈ నోటీసును జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయం 138-పాణ్యం రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో పబ్లిష్ చేసినట్లు తెలిపారు.

శిలాశాసనాలను కాపాడుకుందాం

● ఏపీపీసీసీఎఫ్ చలపతిరావు



అశోకుడి శిలాశాసనాలను సందర్శిస్తున్న ఏపీపీసీసీఎఫ్ చలపతిరావు

తుగ్గలి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): చరిత్రకు ఆనవాలుగా ఉన్న శిలాశాసనాలను కాపాడుకుందామని ఏపీ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (ఏపీపీసీసీఎఫ్) చలపతిరావు పిలుపునిచ్చారు. మండలంలోని జొన్నగిరి గ్రామ శివారులో ఉన్న అశోకుడి శిలాశాసనాలను ఆయన కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి చారిత్రక శాసనాలు ఎంతో విలువైనవని, వాటిని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. ఈ శాసనాలను రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేసి ఉత్తమ పర్యాటక కేంద్రంగా మారిస్తే ఎంతో ప్రాముఖ్యం చేకూరుతుందని అన్నారు. ఆయన వెంట అటవీ అధికారులు, బీట్ ఆఫీసర్ లక్ష్మన్న, అశోకుని శిలాశాసనాల ప్రాంతం సిబ్బంది బాబు తదితరులు ఉన్నారు.

బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడిగా సునీల్‌కుమార్ రెడ్డి



కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడిగా కర్నూలుకు చెందిన సునీల్ కుమార్ రెడ్డిని నియమిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఉత్తర్వులు జారీ చేశారు. సునీల్‌కుమార్ రెడ్డిది మంత్రాలయం మండలం చౌలహళ్లి గ్రామం. 2004 నుంచి ఏబీవీపీ కాలేజీ యూనిట్ సెక్రటరీగా ప్రస్థానం మొదలై.. వివిధ హోదాల్లో పనిచేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగానూ 2010 నుంచి 2014 వరకు అవినీతికి వ్యతిరేకంగా వైఎసీ యూత్ అగైనెస్ట్ కరప్షన్ పేరుతో ఆందోళనలు చేశారు. కర్నూలు జిల్లా కో కన్వీనర్‌గా, జిల్లా కన్వీనర్‌గానూ పని చేశారు. అలాగే 2011 నుంచి ఏపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కర్నూలులో రాయలసీమ యూనివర్సిటీ ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. 2014 నుంచి ఏపీ రాష్ట్ర కార్యదర్శిగా నెల్లూరు రాష్ట్ర మహాసభల్లో ఎన్నికై రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో ఉద్యమాలు నిర్వహించారు. 2017లో బీజేపీలో చేరి బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. బీజేపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించడంతో ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, కర్నూలు జిల్లా బీజేపీ అధ్యక్షుడు రామకృష్ణ, సీనియర్ నాయకులు కపిలేశ్వరయ్య, జేఎస్ నాగరాజు హర్షం వ్యక్తంచేశారు. సునీల్‌కుమార్ రెడ్డిని బీజేవైఎం, వివిధ విభాగాల నాయకులు సన్మానించారు.

భక్తులతో కిటకిటలాడిన మల్లన్న క్షేత్రం



దర్శనం కోసం క్యూలైన్లలో వెళ్తున్న భక్తులు

నంద్యాల కల్చరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మల్లన్న క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పాతాళ గంగలో పుణ్యస్నానాలు ఆచరించి తర్వాత స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో దర్శనానికి రెండు గంటలకు పైగా సమయం పట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తుల శివనామ స్మరణతో క్షేత్ర పరిసరాలు మార్మోగాయి. ఆలయ దర్శనాలు ప్రారంభమై ముగిసేంత వరకు భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేశారు. అలాగే తాగునీటి సౌకర్యం కల్పించారు.

శ్రీశైలంలో ఆక్టోపస్ మాక్ డ్రిల్



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఆక్టోపస్ టీమ్

నంద్యాల కల్చరల్(శ్రీశైలం), ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం డ్యామ్ వ్యూ పాయింట్ నుంచి డ్యాం వరకు ఆయా పరిసర ప్రాంతాల్లో ఆక్టోపస్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ టీమ్ అత్యాధునిక ఆయుధాలతో శనివారం రాత్రి మాక్ డ్రిల్ నిర్వహించింది. రాత్రి సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేసి చిమ్మ చీకటిలో దట్టమైన కొండల నడుమ ఉన్న శ్రీశైలం డ్యామ్‌పై ఆక్టోపస్ పోలీసు బలగాలు మాక్ డ్రిల్ నిర్వహించాయి. ఆక్టోపస్ ఏపీ మంగళగిరి డీఎస్పీ రంగబాబు ఆధ్వర్యంలో 38 మంది ఆక్టోపస్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు. కొండలు, గుట్టలు దిగుతూ చీకట్లో అర్ధరాత్రి వరకు ఆక్టోపస్ పోలీసు బలగాలు మాక్‌డ్రిల్ నిర్వహించగా శ్రీశైలం డ్యామ్ పరిసరాలు మొత్తం చీకటి, నిశబ్దమైన వాతావరణం నెలకొంది.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: కలెక్టర్

గూడూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులకు సూచించారు. మండలంలోని కె.నాగలాపురం గ్రామంలో శనివారం 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర'లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం సుంకులాపరమేశ్వరి ఆలయం ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఆగస్టు మాసంలో 'వర్షాకాల పరిశుభ్రత' థీమ్‌తో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలంలో డ్రైనేజీలు, కుంటలు, గుంతలు, టైర్లల్లో దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా లాంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. దోమలను నివారించాలంటే కచ్చితంగా ఎప్పటికప్పుడు నీటిని తొలగించి స్ప్రే, ఫాగింగ్ చేయడం, ఆయిల్ బాల్స్ వేయడం వంటి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామాల్లో ప్రతి రోజు ఇళ్ల వద్ద నుంచి చెత్తను సేకరించాలని, కాలువలను శుభ్రం చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రత పాటించాలన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు లేకపోతే ప్రతిపాదనలు పంపించాలని, వీధి దీపాలు ఎక్కడైనా లేకుంటే వేయించాలని ఆదేశించారు. అనంతరం క్లాప్ మిత్రలను కలెక్టర్ సన్మానించారు.



'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర'లో ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్

హౌసింగ్ లే అవుట్ పరిశీలన

కె.నాగలాపురం గ్రామంలో పర్యటించిన కలెక్టర్ రంజిత్ బాషా హౌసింగ్ లేఅవుట్‌ను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ అధికారి, హౌసింగ్ పీడీ చిరంజీవి, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, జడ్పీ సీఈవో నాసర రెడ్డి, సర్పంచ్ జె.నయోమి, తహసీల్దార్ వెంకటేశ్ నాయక్, టీడీపీ మండల కన్వీనర్ జె.సురేష్, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తన అలవర్చుకోవాలి
జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి
4
53 సెల్‌ఫోన్లు రికవరీ
బాధితులకు అందజేసిన డీఎస్పీ

వైభవంగా అంజన్న రథోత్సవం



● భారీగా తరలివచ్చిన భక్తులు

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : శ్రావణమాసాన్ని పురస్కరించుకుని పట్టణ శివారులోని కొండల్లో వెలసిన రణ మండల ఆంజనేయ స్వామి రథోత్సవం శనివారం వైభవంగా జరిగింది. 30 రోజులపాటు రణ మండల కొండల్లో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం సింధూర సేవ, అలంకరణ, మహా మంగళహారతి పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆంజనేయుడి భారీ రథోత్సవాన్ని ఆలయ కమిటీ చైర్మన్ టీజీ పాండురంగ, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బసవన్న గౌడ్, ఎగ్గాటి ప్రతాప్, దేవిశెట్టి ప్రకాష్, నీలకంఠ, నాగరాజు గౌడ్, మారుతీరావు ప్రారంభించారు. రథోత్సవం పట్టణంలోని సాయిబాబా విగ్రహం నుంచి టూటౌన్ పోలీస్ స్టేషన్ మీదుగా భీమా సర్కిల్, శ్రీనివాస్ భవన్ నుంచి తిరిగి సాయిబాబా గుడికి చేరుకుంది. అంజనేయుడి మాలధారణ స్వాములు హనుమాన్ నామస్మరణంతో ముందుకు సాగారు.



రణ మండల ఆంజనేయ స్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

తుంగభద్ర తీరం

సాహిత్యం

రాయలసీమ గ్రామీణ జీవిత అస్తిత్వ యుద్ధమే నడూరి మిద్దె



కర్నూలు కల్చరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ ప్రాంతంలోని గ్రామీణ జీవిత అస్తిత్వ యుద్ధమే 'నడూరి మిద్దె' నవల అనిపిస్తుంది. మిద్దెలేని ఇల్లు, మిద్దె లేని మనిషి ఊరులో లేనివాడిలా... మిద్దె ఉన్న వారికే ఊరిలో గౌరవం అని భావించే అనేక గ్రామాల్లోని భావనను రచయిత చక్కగా ఈ నవల్లో చిత్రీకరించారు. కర్నూలుకు చెందిన సురేంద్ర శీలం తక్కువ రచనలే చేసినా, పాఠకుల హృదయాలకు హత్తుకుపోయేలా రాశారు. ప్రస్తుతం సినీ పరిశ్రమలో అసిస్టెంట్ దర్శకునిగా పనిచేస్తున్న ఆయన సామాజిక సమస్యలకు దగ్గరగా రచనలు చేస్తున్నారు. ఆయన రచనల్లో కనిపించే మట్టి వాసన, పల్లె మనుషల మానసికత పరిస్థితి, అణగారిన వర్గాల ఆవేదన, అన్నీ ఆయన స్వయంగా చూసిన జీవనానుభావాల ప్రతిబింబంగా ఈ పుస్తకం నిలుస్తుంది. సీమలో రాత్రిపూట మామిడితోటల్లో కూర్చుని విన్న కబుర్ల నుంచి గంగిరెద్దు ఆటగాళ్ల పాటల్లోంచి, కరువులో ఎండిపోయిన పొలాల నుంచి ఆయన తన కలాన్ని నడిపించారు. నడూరి మిద్దె (నడిఊరిలోని మిద్దె)లో ఒక జీవిత పోరాటం దాగుంది. రాయలసీమ బతుకు బాట, అగాధ దౌర్భాగ్యం, అంతరంగ గౌరవ పోరాటాన్ని గుర్తు చేస్తుంది. మిద్దె అంటే ఇంటికి ఉండే పై కప్పు పొడిగింపు. కానీ ఈ నవల్లో అది కేవలం నిర్మాణం కాదు. పల్లె మనిషి గౌరవం. ఊరిలో మనిషి స్థానం. ఇల్లు సామాజిక అంగీకారం. సిన్నోడు అనే పాత్ర ఈ నవల్లో మనకెదురు అవుతుంది. మిద్దె లేకపోతే అతను ఊరు నుంచీ వెళ్లిపోవాల్సిన పరిస్థితిని భార్య కల్పిస్తుంది. రచయిత ఈ బలహీనతను, ఆవేదనను ఎంత సహజంగా రాశారో చదివే పాఠకులకు హత్తుకుంటుంది. శాంతి పాత్ర కలల్లో బతికే మనిషిలా నిలుస్తుంది. ఆమె తన బిడ్డను మిద్దెలో పెంచాలన్న ఆరాటం, అదే క్రమంలో సిన్నోడు పాత్ర ఆత్మగౌరవం కోసం పోరాడే సాధారణ మనిషి. పెద్దిరెడ్డి, నారాయణరెడ్డి వంటి పాత్రలు ఊర్లోని శక్తికి, ఆధిపత్యానికి ప్రతీకలుగా కనిపిస్తాయి. రచయిత సురేంద్ర రాయలసీమ ఉచ్చారణతో గట్టిగా పలికే పదాలతో, బరువైన వాక్యాలతో నవలను నడిపించారు. ఈ నవల ప్రధానంగా కనిపించే అంశం గౌరవం కోసం మనిషి చేసే పోరాటంగా చెప్పవచ్చు. ఇది ఒక పుస్తకం మాత్రమే కాదు. రాయలసీమ పల్లె జీవన గీతం. పల్లెల్లో ప్రతి ఇల్లు, ప్రతి మానవ సంబంధం, ప్రతి గౌరవం అన్నీ ఈ మిద్దెల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. మిద్దె అనేది సాధారణ పదంగానే అనిపించవచ్చు, కానీ పల్లె ప్రజలకు మాత్రం అదే గౌరవంగా, అస్తిత్వంగా, మనిషికి బతుకుబాటగా నిలుస్తుంది.



- ఆరుద్ర ఈశ్వర్, సాహితీ విమర్శకుడు, కర్నూలు

నడిచే నిఘంటువు.. కేసీ కల్కూర..!



సాహిత్యం, చరిత్ర పరిశోధన, సామాజిక సేవల్లో గుర్తింపు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ధవళ వర్ణపు వదులైన ఖద్దరు చొక్కా, అంచుతో కూడిన తెల్లని పంచెకట్టు, మెడపై కాంగ్రెసు కండువాతో, భుజానికి కాగితాల సంచి తగిలించుకొని కనిపించే ఆయన నిండైన విగ్రహాన్ని వేలమందిలో ఉన్నా ఇట్టే పోల్చుకుంటారు. 'వందేమాతరం' అంటూ ఆయన తన ఉపన్యాసం ప్రసంగించే ముందూ, ప్రసంగం ముగింపులోనూ చేసే జాతీయతా నినాదం మనలోనూ దేశభక్తి భావనను ఉప్పొంగిస్తుంది. సాహిత్యమైనా, చరిత్ర అయినా, సామాజిక అంశాలైనా, ఆధునిక విజ్ఞాన విషయాలైనా ఆయనను అడిగిందే తడవుగా ఉదాహరణలతో సహా ఇట్టే చెప్పేస్తారు. అంతేకాదు, అందుకు పలు అంశాలను కూడా జోడించి మనకు అదనపు సమాచారం కూడా అందజేస్తారు. అందుకే ఆయన్ను అందరూ 'నడిచే నిఘంటువు' అని అంటారు. ఉమ్మడి కర్నూలు జిల్లావాసులకు సుపరిచితమైన ఆ పేరే కురాడి చంద్రశేఖర కల్కూర. అలియాస్ కేసీ కల్కూర. ఒకప్పుడు హోటల్‌లో సప్లయర్ బాయ్‌గా మొదలైన ఆయన జీవిత ప్రస్థానం అనంతర కాలంలో మూడు హోటళ్లకు యజమానిగా చేసింది. సాహిత్యం, సామాజిక సేవా రంగాల్లో అనేక పురస్కారాలు ఆయన్ను వెతుక్కుంటూ వచ్చి వరించాయి.

కర్ణాటక రాష్ట్రంలోని ఉడిపి జిల్లా, కురాడి గ్రామంలో వ్యవసాయ రైతు కుటుంబంలో 20 జూన్ 1940లో కేసీ కల్కూర జన్మించారు. తల్లిదండ్రులు లక్ష్మీదేవమ్మ, నారాయణ కల్కూర వ్యవసాయం చేస్తూనే కుటుంబాన్ని పోషించారు. ఐదుగురు అన్నదమ్ములు, ఇద్దరు అక్కచెల్లెళ్ల మధ్య పుట్టిన కేసీ కల్కూర స్వగ్రామంలోనే ప్రాథమిక విద్య చదువుకున్నారు. 1957లో ఎస్ఎస్ఎల్‌సీ పూర్తి చేసి, బతుకుదెరువు నిమిత్తం అప్పటికే నంద్యాలలోని ఉడిపి కాఫీ బార్‌లో పనిచేస్తున్న అన్నతోపాటూ తాను సప్లయ్ బాయ్‌గా పనిలో చేరాడు. తిరిగి ఉడిపి వెళ్లి 1962లో పీయూసీ పాసై, కర్నూలు ఉస్మానియా కళాశాల్లో 1965లో డిగ్రీ పూర్తి చేశారు. బెంగుళూరు ప్రభుత్వ న్యాయ కళాశాల్లో లా డిగ్రీలో చేరి, 1968లో న్యాయవిద్య పూర్తి చేశాడు. అనంతరం తిరిగి కర్నూలు చేరుకొని 1972 వరకు లాయర్‌గా ప్రాక్టీస్ చేశాడు. ఇదే సమయంలో కర్ణాటక రాష్ట్రంలోని శివమొగ్గ నివాసి ప్రభావతమ్మతో 1970 మార్చి 25న వివాహం జరిగింది. అయితే హోటల్ మేనేజ్‌మెంట్‌పై ఆసక్తి ఉన్న ఆయన తిరిగి హోటల్ రంగంలోనికి ప్రవేశించి, 1975లో ఆదోనిలో తన ఇంటి పేరుతోనే కల్కూర హోటల్ ప్రారంభించారు. తర్వాత 1976లో కర్నూలులో పాతబస్టాండు సమీపంలో, 1979లో జడ్పీరోడ్డులో మరో హోటల్ తెరిచారు. హోటల్ మేనేజ్‌మెంట్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. హోటల్స్ ఓనర్స్ అసోసియేషన్‌లో ఈసీ మెంబర్‌గా, ఉపాధ్యక్షులుగా, కార్యదర్శిగా పనిచేసి, రాష్ట్ర అధ్యక్షులుగానూ కొనసాగారు. అప్పటి ముఖ్యమంత్రులు పీవీ నరసింహారావు, మర్రి చెన్నారెడ్డి, జలగం వెంగళరావు, టి. అంజయ్య, భవనం వెంకట్రామ్, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, ఎన్.జనార్ధన్‌రెడ్డి, వైఎస్ రాజశేఖరరెడ్డిలకు ఆయన ఆతిథ్యం ఇచ్చారు. ముఖ్యంగా నాటి ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డితో ఉన్న అనుబంధంతో కేసీ కల్కూర 1985లో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులుగా కొనసాగారు. అలాగే 1992 నుంచి 1995 వరకు జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా పదవీబాధ్యతలు నిర్వహించారు.



ఆదోని కోట చరిత్రను అధ్యయనం చేస్తున్న కల్కూర

సాహిత్యంలో అభినివేశం.. నిత్య పుస్తక పఠనం

విద్యార్థి దశ నుంచి పుస్తకాలు చదవడం అలవాటు ఉన్న కేసీ కల్కూర తొలుత కన్నడ సాహిత్యానికి సంబంధించిన అనేక పుస్తకాలు చదివారు. డిగ్రీ చదివే రోజుల్లో ఉస్మానియా కళాశాల తెలుగు అధ్యాపకుడు గౌరీశ్వర్ తెలుగు భాషకు సంబంధించిన అనేక పుస్తకాలను చదవమని ప్రోత్సహించారు. బెంగుళూరులో ఆంగ్ల సాహిత్యాలను అధ్యయనం చేశారు. ఇలా మూడు భాషల్లో వేలాది పుస్తకాలు చదివారు. 1997లో గాడిచర్ల ఫౌండేషన్ సంస్థను స్థాపించి గ్రంథాలయ ఉద్యమ కార్యక్రమాలను చేపట్టారు. 2000 సంవత్సరంలో సాహితీ సదస్సునకు అధ్యక్షులుగా ఎన్నికయ్యాక ప్రతినెలా సదస్సు ద్వారా అనేక కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. పుస్తక పఠనం ఒక అలవాటుగా చేసుకున్న కేసీ కల్కూర నిత్యం నాలుగు గంటల పాటూ పుస్తక పఠనానికి కేటాయిస్తారు. ఆయన భద్రపరచిన 2వేలకు పైగా ఎన్నో గొప్ప పుస్తకాలు 2009 నాటి తుంగభద్ర వరదల్లో ధ్వంసమయ్యాయి. తిరిగి సుమారు 3వేల పుస్తకాలను తన ఇంటి గ్రంథాలయంలో భద్రపరచుకున్నారు. అలాగే అనేక సంవత్సరాలుగా తాను రాసి, హిందు దినపత్రికలో ముద్రితమైన లేఖలను 2001లో ఒక పుస్తకరూపంలో తీసుకువచ్చారు. 'గార్లండ్ ఆఫ్ లెటర్స్' పేరుతో ఈ పుస్తకంలో అనేక సామాజిక అంశాలను ఆయన ప్రస్తావించారు. జిల్లాతో ఉన్న తన అనుబంధాన్ని, జిల్లా చరిత్రకు సంబంధించిన అనేక అంశాలను 'అమ్మ ఒడిలో' అనే ఆత్మకథ ద్వారా ముందుకు తీసుకురానున్నారు. తుంగభద్ర నది పుట్టుక చరిత్రపై కూడా పరిశోధనాత్మక గ్రంథాన్ని త్వరలో పూర్తి చేయనున్నారు.

పురస్కారాలు ఎన్నో..

- శ్రీకృష్ణ సేవానుగ్రహ ప్రశస్తి (1992, 2007 సంవత్సరాల్లో)
- కల్లూరు సుబ్బరావు పురస్కారం (2005) కళాజ్యోతి.
- ధర్మవరం, అనంతపురం జిల్లాల నుంచి, విజయ విఠల ప్రశస్తి.
- 2008 మంత్రాలయం శ్రీరాఘవేంద్రస్వామి మఠం వారి నుంచి.
- అయ్యంకి వెంకటరమణయ్య గ్రంథాలయ కీర్తి పురస్కారం.
- 2010 శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాద్ వారి నుంచి ప్రతిభా పురస్కారం.
- 2010 కర్నూలు యునైటెడ్ క్లబ్ వారి సేవా పురస్కారం.
- 2015లో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉగాది పురస్కారం.





ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ఉగాది పురస్కారం అందుకుంటూ..

ఇంట్లో గ్రంథపఠనం చేస్తూ..

సురవరం సుధాకర్‌రెడ్డికి సీపీఐ సంతాపం

కర్నూలు కల్చరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అగ్రనాయకుడు, సీపీఐ పూర్వ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మృతిపై ఆ పార్టీ జిల్లా సమితి నాయకులు శనివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. సురవరం సుధాకర్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందడం దేశంలో కమ్యూనిస్టు ఉద్యమానికి, కార్మిక, కర్షకులు, కష్టజీవులకు తీరని లోటని జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు జిల్లా సమితి తరఫున ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. సురవరం సుధాకర్‌రెడ్డికి బాల్యం నుంచి కర్నూలు జిల్లాతో ఎనలేని అనుబంధం ఉందన్నారు. ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శిగా, జిల్లా కార్యదర్శిగా, జాతీయ స్థాయిలో విద్యార్థి, యువజన సంఘాల ప్రధాన కార్యదర్శిగా పనిచేశారని తెలిపారు. 1994లో నాటి జిల్లాలోని డోన్ అసెంబ్లీ స్థానానికి నాటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డిపై పోటీ చేశారన్నారు. మొగలవల్లి గ్రామంలో జరిగిన భూ పోరాటానికి నాయకత్వం వహించి 1100ఎకరాల మిగులు భూములను పేదలకు పంపిణీ చేసిన చరిత్ర ఆయనకే దక్కుతుందన్నారు.

విద్యార్థులు టంగుటూరి గురించి తెలుసుకోవాలి

- కేవీఆర్ కళాశాలలో 153వ జయంతి

కర్నూలు అర్బన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు టంగుటూరి ప్రకాశం పంతులు చరిత్ర తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, లయోలా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ముప్వా శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో సాహితీ సదస్సు ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు 153వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం పంతులు రాజకీయ జీవితం రాజమండ్రి మున్సిపల్ కౌన్సిలర్‌గా ప్రారంభమైందన్నారు. ఆయన ఎక్కడ పనిచేసినా పేద ప్రజల కోసం పరితపించే వారని, అలాంటి నాయకుడు మన తెలుగు వాడు కావడం హర్షించదగ్గ విషయమన్నారు. కురాడి చంద్రశేఖర్ కల్కూర మాట్లాడుతూ ప్రజల కోసం సర్వం త్యాగంచేసిన మహనీయుడు ఆంధ్రకేసరి అని, అలాంటి మహనీయుడి విగ్రహం కర్నూల్లో ఏర్పాటు చేయాలన్నారు. క్లస్టర్ యూనివర్సిటీ డీన్ అక్తర్‌భాను మాట్లాడుతూ విద్యార్థులు ప్రకాశం పంతులు జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. మానవ శక్తి పరిశోధన కేంద్ర వ్యవస్థాపకుడు డాక్టర్ మన్సూర్ రెహమాన్ మాట్లాడుతూ ధైర్యానికి మారుపేరు సింహం అయితే ఆంధ్ర సింహం ప్రకాశం పంతులని కొనియాడారు. అనంతరం క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతులు, మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఎస్ఆర్‌కే శర్మ, గంగాధర్‌రెడ్డి, మనోహర్, పూర్వ విద్యార్థిని సుబ్బలక్ష్మి, డి.పార్వతి, చరిత్ర అధ్యాపకురాలు తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ ముప్వా శ్రీనివాసరెడ్డి తదితరులు

ఖైదీలు సత్ప్రవర్తన అలవర్చుకోవాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి



రికార్డులను తనిఖీ చేస్తున్న లీలా వెంకటశేషాద్రి

కర్నూలు లీగల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఖైదీలు సత్ప్రవర్తనను అలవర్చుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి సూచించారు. శనివారం స్థానిక మహిళా జైలును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖైదీలు తమ కుటుంబాన్ని, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నేర స్వభావాన్ని విడిచి మంచి పౌరులుగా మారాలని కోరారు. అనంతరం మహిళా చట్టాల గురించి ఖైదీలకు వివరించారు. అనంతరం ఖైదీలకు అందిస్తున్న భోజన, వసతి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఖైదీల గదులు, వంటశాల, రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ న్యాయవాది సులోచన తదితరులు పాల్గొన్నారు.

అమ్మ పేరుతో ఓ మొక్క



చాగలమర్రి బాలికల పాఠశాలలో మొక్క నాటుతున్న విద్యార్థులు, హెచ్‌ఎం

- మొక్కలు నాటిన స్టూడెంట్స్‌కు గ్రీన్ పాస్‌పోర్ట్స్
- పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల భాగస్వామ్యం
- జిల్లాలో ఇప్పటికే 62వేల మొక్కలు పంపిణీ

చాగలమర్రి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు గ్రీన్ పాస్‌పోర్ట్ ఇస్తున్నారు. అయితే ఇది మన గుర్తింపును తెలియజేసే పాస్‌పోర్టులాంటిది కాదు. అమ్మ పేరుతో మొక్కలు నాటినందుకు ఇచ్చే గ్రీన్ పాస్‌పోర్టు. ఇందులో విద్యార్థులకు సంబంధించిన నాటిన మొక్కల వివరాలు నమోదు చేయడంతో పాటు ఎదుగుదల ఆధారంగా పాయింట్లు ఇస్తారు. విద్యార్థి ఫొటోతో ఉండే గ్రీన్ పాస్‌పోర్టు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంటోంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్ మీటింగ్(పీటీఎం) నిర్వహించిన రోజునే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థులతో మొక్కలు నాటించి వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మొక్కల పెంపకంపై విద్యార్థుల్లో ఆసక్తి పెంచేందుకు వారికి గ్రీన్ పాస్‌పోర్ట్‌లు అందించాలని నిర్ణయించారు. అమ్మ పేరుతో ఇప్పటికే మొక్కలు నాటిన విద్యార్థులకు వీటిని అందజేస్తున్నారు. విద్యార్థి ఫొటో, వారు పెంచే మొక్కల వివరాలతో ఉన్న గ్రీన్‌పాస్‌పోర్టు వారిలో ఆసక్తి కలిగిస్తోంది. గ్రీన్‌పాస్‌పోర్టును అందించిన తరువాత మొక్కలు నాటేందుకు ముందుకు వచ్చిన విద్యార్థుల సంఖ్య అధికంగా ఉంది.

అమ్మపేరుతో..

మెగా పీటీఎంలో అమ్మకు వందనం పేరుతో విద్యార్థులతో వారి తల్లిదండ్రులకు పాదాభివందనం చేయించిన ప్రభుత్వం ఇప్పుడు అమ్మ పేరుతో మొక్క(ఏక్‌పేడ్ మాకేనామ్) వారిని పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు చేసే చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా విద్యార్థులకు ఎన్ని మొక్కలు అవసరమో ముందుగానే వివరాలు సేకరించి వారికి వాటిని అందించారు. జిల్లాలోని 29 మండలాల్లో 1,959 పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలలకు 62 వేల మొక్కలను విద్యార్థులకు అందించి పాఠశాలల ఆవరణలు, ఖాళీ ప్రదేశాల్లో నీటించారు.

గ్రీన్ పాస్‌పోర్టు అంటే..



విద్యార్థి నాటిన మొక్క ఆ విద్యార్థి వివరాలతో కూడినదే గ్రీన్ పాస్ పోర్టు. దీనిని ఆకట్టుకునేలా ఆకుపచ్చ రంగులో తీర్చిదిద్దారు. కవర్‌పై గ్రీన్ పాస్‌పోర్టు, అమ్మపేరుతో మొక్క అని ఉంటుంది. మొదటి పేజీలో విద్యార్థి ఫొటో, పేరు, అపార్ ఐడీ, వయస్సు, పేన్‌ఐడీ, పాఠశాల పేరు, చిరునామా ఉంటుంది. రెండో పేజీలో మొక్క పేరు, దాని శాస్త్రీయ నామం, ఏరోజున మొక్క నాటారు?, ఎక్కడ నాటారు?.. ఆ ప్రదేశం వివరాలను నమోదు చేస్తారు. ఇక్కడి నుంచి మొక్క పెరుగుదలలో విద్యార్థి భాగస్వామ్యం మొదలవుతుంది. ఎప్పటికప్పుడు మొక్క పెరుగుదలను సహచర విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పరిశీలించుకోవాల్సి ఉంటుంది.

విద్యార్థులు ఆసక్తిగా ముందుకు వస్తున్నారు



అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు విద్యార్థులు ఆసక్తిగా ముందుకు వస్తున్నారు. వీరికి ఇచ్చే గ్రీన్‌పాస్ పోర్టు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అమ్మ కోసం మొక్క నాటడాన్ని విద్యార్థులు బాధ్యతగా ఫీల్ అవుతున్నారు. 43 పాఠశాలల్లో మొక్కలను అందించాం. గ్రీన్ పాస్‌పోర్టులను పంపిణీ చేశాం.

- న్యామతుల్ల, ఎంఈవో, చాగలమర్రి



కస్తూర్బాలో మొక్క నాటుతున్న ఎస్‌వో, బాలికలు

మొక్కల కోసం ఏమి చేయాలి?

అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆసక్తిగల విద్యార్థి వివరాలను ప్రతి పాఠశాలలో తీసుకుంటారు. వీరు ఒకటి నుంచి మూడు రకాల మొక్కల వరకు ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు. ఒక మొక్క చనిపోతే మరో మొక్క నాటేందుకు అవకాశం ఉంటుంది. ఇలా ఎంపిక చేసుకోగానే పేరు, అపార్ ఐడీ వివరాలను ఉపాధ్యాయులు నమోదు చేస్తారు. ఇప్పటికే పలు పాఠశాలల్లో ఈ ప్రక్రియ జరుగుతోంది. అటవీశాఖ సూచించిన నర్సరీ పాయింట్ల వద్దకు వెళ్లి విద్యార్థులు కోరుకున్న మొక్కలను పాఠశాలకు తీసుకొచ్చి వారికి ఎంఈవోలు, హెచ్‌ఎంలు అప్పగించాలి. ఇందుకు విద్యాశాఖ సమగ్ర శిక్ష ద్వారా ప్రతి మొక్కకు రవాణా, ఇతర చార్జీలుగా నిధులు మంజూరు చేశారు. ఈ విధంగా వచ్చిన తరువాత విద్యార్థులు మొక్కలు నాటి సెల్ఫీలు తీసుకోవాలి. ఈ ప్రక్రియను లీప్ యాప్ ద్వారా పూర్తి చేయాలి.

53 సెల్‌ఫోన్లు రికవరీ

బాధితులకు అందజేసిన డీఎస్పీ



సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న డీఎస్పీ ప్రమోద్

ఆళ్లగడ్డ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలో పోలీసులు 53 సెల్‌ఫోన్‌లు ట్రేస్ చేసి రికవరీ చేశారు. ఈ సెల్‌ఫోన్లను శనివారం డీఎస్పీ ప్రమోద్ ఫిర్యాదుదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్ పోయిన వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి సీఈఐఆర్ పోర్టల్‌లో మొబైల్ వివరాలు నమోదు చేయాలన్నారు. పోలీస్ చాట్‌బాట్ నెంబర్ 9121101107కు సందేశం పంపి అవసరమైన వివరాలు నమోదు చేయాలన్నారు. ఈ వివరాలు సెంట్రల్ డేటాబేస్‌లోకి చేరి మొబైల్‌ను ట్రేస్ చేసిన తరువాత యజమానులకు అందజేయనున్నట్లు తెలిపారు.

నేడు 'స్వామి వివేకానంద' పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన రచయిత ఇంద్రకంటి వేంకటేశ్వర్లు రచించిన యుగపురుషుడు 'స్వామి వివేకానంద' పుస్తక ఆవిష్కరణ ఆదివారం ఉదయం 10.30 గంటలకు నగరంలోని చిదంబరరావు వీధిలోగల స్వామి వివేకానంద సంస్కృత పాఠశాల్లో ఏర్పాటుచేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షుడిగా ప్రముఖ న్యాయవాది, సంస్కృత పాఠశాల కరస్పాండెంట్ ఎండీవీ జోగయ్య శర్మ వ్యవహరిస్తారని, ముఖ్య అతిథిగా రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య హాజరవుతారని వివరించారు. విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ కొట్టే చెన్నయ్య పుస్తక సమీక్ష చేస్తారని తెలిపారు.

పట్టుబడి పంతులయ్యారు..!

(3వ పేజీ తరువాయి)

సర్టిఫికెట్ల పరిశీలనకు సన్నాహాలు

జిల్లాలో డీఎస్సీ-2025 ప్రతిభ చూపి ఉపాధ్యాయ ఉద్యోగం ఖరారు అయిన అభ్యర్థుల దరఖాస్తులు పరిశీలనకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. 50 అభ్యర్థులకు ఒక బృందం ఉంటుంది. సోమవారం నుంచి సర్టిఫికెట్లు పరిశీలిస్తారు. ప్రతి జిల్లాకు సీనియర్ అధికారులను ఇన్‌చార్జిగా నియమిస్తారు. ఒకేసారి అన్ని సర్టిఫికెట్లు పరిశీలన పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. శనివారం సునయన ఆడిటోరియంలో ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, డిప్యూటీ తహసీల్దారులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు. విద్యా శాఖ రాష్ట్ర సంయుక్త సంచాలకులు అబ్రహాం, ప్రాంతీయ సంచాలకులు కె.శామ్యూల్ వర్చువల్ ద్వారా విధివిధానాలను వివరించారు. కర్నూలు, నంద్యాల డీఈవోలు ఎస్.శామ్యూల్‌పాల్, జనార్దన్‌రెడ్డి, కర్నూలు జిల్లా ట్రైబల్ వెల్ఫేర్, సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ శాఖల అధికారులు హాజరయ్యారు. ఎస్జీటీ అభ్యర్థులకు కర్నూలులోని రాయలసీమ యూనివర్సిటీలో, స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) లాంగ్వేజ్ అభ్యర్థులు నన్నూరు సమీపంలో మారుతి ఎస్టేట్ శ్రీరాఘవేంద్ర బీఎడ్ కళాశాలలో, స్కూల్ అసిస్టెంట్ నాన్-లాంగ్వేజ్ అభ్యర్థులు నన్నూరు సమీపంలో మారుతి ఎస్టేట్-2లో ఉన్న శ్రీనివాస బీఎడ్ కళాశాలలో 25వ తేదీ (సోమ వారం) నుంచి సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని కర్నూలు డీఈవో తెలిపారు. 54బృందాలు (టీమ్‌లు), 216 మంది విద్యా, రెవెన్యూ, వైద్య అధికారులు పరిశీలనలో పాల్గొంటారు. 170 మంది వలంటీర్లు అందుబాటులో ఉంటారు. సమాచారం కోసం హెల్ప్ డెస్క్‌లో ఉండే నరసయ్య-81218 21266, సూపరింటెం డెంట్ మదుల్లా-96036 83182, ఏడీ కె.నాగభూషణం-91776 79042 లకు కాల్ చేయవచ్చని డీఈవో తెలిపారు.

ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు..

డీఎస్సీ అర్హత సాధించిన అభ్యర్థులు సంబంధిత విద్యార్హత ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఇటీవల తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రం, గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన మూడు సెట్లు సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, ఐదు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాల్సి ఉంటుంది. అంతకు ముందే ఆసర్టిఫికెట్లు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని విద్యా శాఖ అధికారులు తెలిపారు. అభ్యర్థులు వారికి కేటాయించిన తేదీ, సమయానికి సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కాకపోతే వారి అభ్యర్థిత్వం రద్దుచేసి, ఆ తరువాత మెరిట్ ఉన్న అభ్యర్థిని సర్టిఫికెట్ల పరిశీలనకు పిలుస్తారు. దీంతో ఎన్ని ఇబ్బందులున్నా, కేటాయించిన తేదీ, సమయానికి సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలని డీఈవో శామ్యూల్‌పాల్ 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. కుల, రెవెన్యూ సర్టిఫికెట్ల పరిశీలనకు రెవెన్యూ అధకారులు, దివ్యాంగ సర్టిఫికెట్ల పరిశీలనకు డాక్టర్లు అందుబాటులో ఉంటారు. ఒకే అభ్యర్థికి రెండు, మూడు ఉద్యోగాలకు ఎంపికై, అందులో ఒక పోస్టును ఎంపిక చేసుకుంటే, మిగిలిన పోస్టులకు తర్వాత అభ్యర్థులను సర్టిఫికెట్ల పరిశీలనకు పిలుస్తారు. దీంతో కటాఫ్ మార్కులు, ర్యాంకుల్లో స్వల్ప తేడాలు వచ్చే అవకాశం లేకపోలేదు.

గురువు ఉద్యోగం సాధించాలన్నదే..

- స్కూల్ అసిస్టెంట్ జిల్లా టాపర్‌గా సాయినవీన్

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): టీచర్ ఉద్యోగం సాధించాలన్న తపనతో రోజుకు 12 నుంచి 16 గంటల పాటు చదివి పట్టుబట్టి సాధించారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో ఆదోనికి చెందిన సాయి నవీన్ స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్‌లో జిల్లా మొదటి స్థానంలో నిలిచారు. తండ్రి ఆర్ కిషోర్ రిటైర్డ్ ఉద్యోగి, తల్లి జె.విజయ్ కుమార్ ఆస్పరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు.



కుటుంబ సభ్యులతో సాయి నవీన్

ర్యాంకుల దీపిక



నంద్యాల ఎన్జీవోస్ కాలనీకి చెందిన దీపిక ఏకంగా మూడు ర్యాంకులు సాధించారు. పశ్చిమ గోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన దీపిక నంద్యాలకు చెందిన డ్రాయింగ్ మాస్టర్ ఆదిశేషును వివాహం చేసుకుంది. పట్టణంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో జిల్లాస్థాయిలో మొదటిర్యాంక్, పీజీటీ జోన్-2లో రెండవ ర్యాంక్, టీజీటీలో 7వ ర్యాంక్ సాధించారు.

కౌతాళం మండలానికి ర్యాంకుల పంట



స్వాతి, వడ్డే నాగరాజు, కావ్య

కౌతాళం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ మెరిట్ లిస్ట్‌లో కౌతాళం మండలంకు చెందిన విద్యార్థులు ర్యాంకులు సాధించి ఉపాధ్యాయ కొలువులను చేజిక్కించుకున్నారు. ముఖ్యంగా కన్నడ మీడియం విభాగంలో నదిచాగి గ్రామానికి చెందిన 8 మంది ఉపాధ్యాయ కొలువులకు ఎంపిక కావడంతో ఆగ్రామంలో ప్రజలు సంబరాలు చేసుకున్నారు. మండలంలోని నదిచాగి గ్రామం నుంచే ఎనిమిది మంది ఉపాధ్యాయ కొలవులు సాధించారు. స్కూల్ అసిస్టెంట్ల విభాగంలో సోషల్‌లో జిల్లా మొదటి ర్యాంకు స్వాతి, కన్నడలో జిల్లా రెండో ర్యాంకు వడ్డే నాగరాజు, గణితంలో జిల్లా 5వ ర్యాంకు మంజుశ్రీ, ఎస్జీటీ కన్నడలో కావ్య జిల్లా 3వ ర్యాంకు, తొగట చరణ్ రాజ్ జిల్లా 10వ ర్యాంకు, రాంతుల్లా 14, విజయ్ కుమార్ 25, వైశాఖ శెట్టి 29వ ర్యాంకులు సాధించారు. ఒకేసారి తమ గ్రామం నుంచి 8 మంది ఉపాధ్యాయ పోస్టులకు ఎంపిక కావడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అలాగే మండల పరిధిలోని ఎరిగేరి గ్రామానికి చెందిన జయకర్ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో ఇంగ్లీష్‌లో జిల్లా 10వ ర్యాంకు సాధించారు.

ప్రభాకరుడి ప్రతిభ

- రెండు ఉద్యోగాలకు ఎంపిక



నంద్యాల హాస్పిటల్: కర్నూలు జిల్లా సి.బెళగల్‌లోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పీఈటీగా కాంట్రాక్ట్ పద్ధతిన పని చేస్తున్న డేరంగుల ప్రభాకర్ డీఎస్సీలో ప్రతిభ చాటాడు. రెండు ఉద్యోగాలకు ఎంపిక అయ్యాడు. జూపాడుబంగ్లా మండలం తూడిచెర్లకి చెందిన సాధారణ రైతు కుటుంబం రామకృష్ణుడు, వరలక్ష్మమ్మకు రామగోపాల్, బాలకృష్ణ, ప్రభాకర్ అనే ముగ్గురు సంతానం. చివరివాడైన ప్రభాకర్ బీపీఈడీ కోర్సు చేసి పీఈటీగా పనిచేస్తున్నారు. ఇటీవలి డీఎస్సీలో పీఈటీ పోస్టుకు 83మార్కులతో రాయలసీమ జోన్‌స్థాయిలో 17వ ర్యాంక్ సాధించి పీఈటీగా ఎంపికయ్యారు. అలాగే 85మార్కులతో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ పోస్టుకు 11వ ర్యాంక్ సాధించి ఎంపికయ్యారు.

టైలర్ మాస్టర్



శిరివెళ్ల: టైలరింగ్ పనిచేస్తున్న నసీరుద్దీన్ డీఎస్సీలో సత్తా చాటి గురువుగా మారనున్నారు. శిరివెళ్లకు చెందిన నసీరుద్దీన్ స్కూల్ అసిస్టెంట్ హిందీ విభాగంలో 82.37మార్కులతో ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. ఉపాధ్యాయ ఉద్యోగం సాధించి విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలన్న సంకల్పం నెరవేరిందని నసీరుద్దీన్ అన్నారు. జిల్లాస్థాయిలో మొదటి ర్యాంకు సాధిం చిన ఆయనను పలువురు గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

అద్దె వాహనం పేరుతో అక్రమాలు

- స.హ చట్టం ద్వారా వెలుగులోకి



మాట్లాడుతున్న ముందడుగు జిల్లా అధ్యక్షుడు దేశాయి చంద్రన్న

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): డివిజన్ లెవెల్ పంచాయతీ అధికారులు అద్దె వాహనం పేరుతో అక్రమాలకు పాల్పడ్డారని ముందడుగు వేదిక జిల్లా అధ్యక్షుడు దేశాయి చంద్రన్న ఆరోపించారు. శనివారం ఆయన భీమాస్ హాలులో స.హ. చట్టం కార్యకర్తలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవో ఎమ్మెస్ నెంబర్ 87, 1/7/2017 ప్రకారం డీఎల్‌పీవో కార్యాలయ అధికారులు వినియోగిస్తున్న అద్దె వాహనాలు, అద్దె చెల్లింపు వివరాలు ఇవ్వాలని స.హ చట్టం కార్యకర్త శాంతకుమార్ దరఖాస్తు చేసుకున్నారన్నారు. 2017 ఏప్రిల్ ఒకటి నుంచి 2024 నవంబరు 30 వరకు రెండు వాహనాలు వినియోగించినట్లు, అందుకు రూ.20లక్షలు వాహన యజమాని ప్రతాప్‌నకు చెల్లించినట్లు సమాచారం ఇచ్చారన్నారు. ఏపీ 21 ఏఎస్4760, ఏపీ 39 యూబీ 1554 ఎల్లో బోర్డు వాహనాలు వినియోగిస్తున్నట్లు తెలిపారన్నారు. కాగా ఈ వాహనాలకు సంబంధించిన వివరాల కోసం జిల్లా రవాణా శాఖ అధికారికి దరఖాస్తు చేసుకున్నామన్నారు. ఏపీ 21 ఏఎస్ 4760 వాహనం మోటార్ సైకిల్ అని, మరో వాహనం ఎల్లో బోర్డు అని తెలియజేశారని వివరించారు. కాగా కార్యాలయానికి అద్దె ప్రాతిపదికన వాహనాలు నాలుగు చక్రాలవి మాత్రమే వాడాలని తెలిపారన్నారు. అయితే మోటార్ సైకిల్ నెంబర్‌తో రూ.20 లక్షల ప్రజాధనాన్ని స్వాహా చేశారని ఆరోపించారు. దీనిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై కలెక్టర్, ఏసీబీ, జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. పంచాయతీ అధికారులు తిమ్మక్క, నూర్జహాన్, శ్రీనివాసులుపై చర్యలు తీసుకుని దుర్వినియోగమైన నిధులను రాబట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ముందడుగు వేదిక కార్యకర్తలు శాంతకుమార్, కృష్ణన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఏజెంట్‌గా ఎన్నికల కమిషన్

- ఏఐసీసీ సభ్యుడు, నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్



ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కల్లూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ బీజేపీ ఏజెంట్‌గా పనిచేస్తోందని ఏఐసీసీ సభ్యుడు, నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ ఆరోపించారు. కర్నూలు నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని దామోదరం సంజీవయ్య భవనం నుంచి బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు శనివారం భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. స్వతంత్ర వ్యవస్థ కాస్త బీజేపీలో కీలుబొమ్మగా మారిందని ఆరోపిం చారు. పవిత్రమైన ఓటు బీజేపీ అధికార దాహానికి దుర్వినియోగం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ తీరుపై నిప్పులాంటి నిజాలను రాహుల్‌గాంధీ బయట పెట్టారని, అయితే సమాధానం చెప్పాల్సిన ప్రధాని మోదీ మౌనం వహిస్తున్నారని ధ్వజమెత్తారు. డిక్లరేషన్ అంటూ వెనుకుండి నాటకాలు ఆడిస్తున్నారని మండిపడ్డారు. రాహుల్‌గాంధీ సంధించిన 5 ప్రశ్నలకు ఈసీ వెంటనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డోన్, శ్రీశైలం, నంద్యాల, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, బనగానపల్లె నియోజకవర్గాల ఇన్‌చార్జిలు మద్దిలేటి, ఇస్మాయిల్, పుల్లయ్య, హుస్సేన్‌బాషా, నాగరాజు, బాలు యాదవ్, కర్నూలు నగర ఇన్‌చార్జి జిలానీబాషా, నాయకులు అనంతరత్నం మాదిగ, జనార్దన్, వైసంజీవ్‌కుమార్, రాజాక్ వలి, హబీబ్ పఠాన్, జాకీర్ హుస్సేన్, ఆరిఫ్, మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా ఉంచాలి

- రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహ్మద్ ఆలీ



మాట్లాడుతున్న రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సీఈవో మహ్మద్ ఆలీ

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సంస్థల ఆస్తుల వివరాల రికార్డులను సక్రమంగా ఉంచాలని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహ్మద్ ఆలీ అన్నారు. నంద్యాల జిల్లా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ఉమ్మడి జిల్లాల ముతవల్లీలతో శనివారం సమావేశమయ్యారు. వక్ఫ్‌బోర్డు కేవలం 7శాతం ఆదాయం మాత్రమే నిధులుగా సేకరిస్తుందని, మిగిలిన 93 శాతం ఆదాయాన్ని వక్ఫ్ డీడ్‌ల ప్రకారం పేదల సంక్షేమం, విద్యారంగం కోసం వినియోగించాలన్నారు. కానీ అనేక సంస్థలు నిబంధనలను పాటించడం లేదన్నారు. అనంతరం ఉమ్మీద్ పోర్టల్‌పై అవగాహన కల్పించారు. జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి సయ్యద్ సబీహా పార్వీన్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల్లో ఎక్కువ సంఖ్యలో వక్ఫ్ సంస్థలు ఉన్నాయని, వాటి రక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో 300 మంది ముతవల్లీలు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధులను సర్పంచ్ కాజేశారు

- ఎంపీడీవోకు సాతనూరు గ్రామస్థుల ఫిర్యాదు



బురద రోడ్డును చూపుతున్న సాతనూరు గ్రామస్థులు

కోసిగి ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సర్పంచ్, ఆమె కుటుంబ సభ్యులు పంచాయతీ నిధులను కాజేశారని సాతనూరు గ్రామస్థులు వెంకటేశ్, నజీర్‌తో సుమారు వంద మంది గ్రామస్తులు ఆరోపించారు. సమాచారం హక్కు చట్టం కింద సమాచారం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఎంపీడీవో ఈశ్వరయ్యస్వామికి ఫిర్యాదు చేశారు. గ్రామస్థులు మాట్లాడుతూ 2024-25 మధ్య కాలంలో సాతనూరు పంచాయతీ నుంచి సర్పంచ్, కుటుంబ సభ్యులు రూ.1.20 కోట్లు నిధులు మంజూరు చేయగా.. అందులో రూ.40 లక్షలు మాత్రమే పనులు చేసినట్లు తెలిసిందని, మిగతా డబ్బులకు ఏవేవో లెక్కలు చూపి పంచాయతీ సర్పంచ్, కుటుంబ సభ్యులు కాజేశారని ఆరోపించారు. గ్రామంలోని బీసీ, ఎస్సీ, వాల్మీకి నగర్‌లో నేటికీ కూడా బురద రోడ్లు, డ్రైనేజీ లేని రోడ్లు ఉన్నాయని, తాగడానికి నీరు సక్రమంగా రావడం లేదని, వీధి లైట్లు, దోమల బెడద అధికంగా ఉందని, ఫాగింగ్ కూడా చేయడం లేదని అన్నారు. గతంలో పని చేసిన పంచాయతీ అధికారుల అండదండలతో వారికి మామూళ్లు ఇచ్చుకుని సాతనూరు పంచాయతీలో తప్పుడు బిల్లులు చూపించి స్వాహా చేశారని గ్రామస్థులు ఆరోపించారు. అలాగే గ్రామంలోని బురద రోడ్లను, ఇళ్ల ముందు వర్షపు నీరు నిల్వ ఉండడాన్ని చూపారు. గ్రామస్థుల ఫిర్యాదుపై విచారిస్తామని ఎంపీడీవో చెప్పారు.

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం

నంద్యాల టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో శనివారం కారు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందినట్లు ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్త తెలిపారు. వివరాలు.. ఒంగోలు జిల్లా కనిగిరి మండలం సీఎస్ పురం గ్రామానికి చెందిన దేవదాస్ (45) నంద్యాలలో భవన నిర్మాణ కూలీగా పనిచేసే వాడు. శనివారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి హైవేపైకి రాగా హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్తున్న కారు ఢీకొట్టి మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల జీజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

పకడ్బందీగా జీఎన్ఎం పరీక్షలు

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీలో జరుగుతున్న జీఎన్ఎం నర్సింగ్ సప్లిమెంటరీ పరీక్ష కేంద్రాన్ని శనివారం కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు అకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, పర్సులు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రంలోనికి తీసుకెళ్లకుండా తనిఖీలు చేపట్టినట్లు సూపరింటెండెంట్ తెలిపారు. మాస్ కాపీయింగ్ జరగకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండోరోజు మెడికల్, సర్జికల్, నర్సింగ్ పరీక్షకలు 144 మందికి గానూ 131 మంది హాజరయ్యారు. 13 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. తనిఖీలో సీఎస్ఆర్ఎంవో డా.వెంకట రమణ, స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ వినోదిని పాల్గొన్నారు.

అసంక్రమిత వ్యాధులతో అధిక మరణాలు

- ఆర్‌బీఎస్‌కే జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ మహేశ్వర్ ప్రసాద్

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అసంక్రమిత వ్యాధులతో అధికంగా మరణాలు సంభవిస్తున్నాయని, 30 సంవత్సరాలు దాటిన వారిలో బీపీ, షుగర్, వంటి సమస్యలు వస్తున్నాయని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ మహేశ్వర ప్రసాద్ అన్నారు. కర్నూలు మెడికర్ కాలేజీ న్యూ ఆడిటోరియంలో ఎన్‌సీడీ-4-0 క్యాన్సర్ వ్యాధి నివారణపై వైద్యుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నోటి, రొమ్ము, గర్భాశయ చికిత్స చేయించుకోవాలన్నారు. అసంక్రమిత వ్యాధులు ఉన్న వారు ఆరోగ్యంగా కనిపిస్తున్నా శరీరం లోపల గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ, కళ్లు, వంటి కీలక అవయవాల పనితీరు మందగిస్తుందని హెచ్చరించారు.

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుదాం



మాట్లాడుతున్న కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు అర్బన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని నగర పాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. శనివారం క్యాంప్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ జమ్మిచెట్టు, సంకల్ బాగ్, ఓల్డ్ పంప్ హౌస్ వద్ద ఉన్న మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేం దుకు చర్యలు చేపట్టాలని సూచించారు. మరో ఎస్టీపీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. స్మార్ట్ సిటీలో భాగంగా 5 పార్క్‌లను అభివృద్ధి చేయడం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, ఓఆర్ఆర్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మునగాలపాడు సమ్మర్‌స్టోరేజీ ట్యాంక్, వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను ఆయన పరిశీ లించారు. అక్కడ నగర పాలక సంస్థకు చెందని 135 ఎకరాల భూమిని సర్వే చేసి, రక్షణ వలయం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాధవీ నగర్ సమీపంలో తాగునీటి నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఈ శేషసాయి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి, ఏడీ విజయలక్ష్మి, ఎంఈ మనోహర్‌రెడ్డి, డీఈ గిరిరాజ్, నరేష్ గంగాధర్, కృష్ణలత పాల్గొన్నారు.

పనితీరు మెరుగుపడాలి: కమిషనర్

కర్నూలు కల్చరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సిబ్బంది పనితీరు మెరుగు పడకపోతే చర్యలు తప్పవని నగర పాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ హెచ్చరించారు. శనివారం ఆయన చాంబర్‌లో రెవెన్యూ విభాగంతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఆస్తిపన్ను మదింపులో పొరపాట్లు జరిగితే ఉపేక్షించేది లేదని, మొండి బకాయలను వెంటనే రాబట్టాలని సూచిం చారు. రోజురోజుకూ పనితీరు మెరుగుపర్చుకోవాలని, మార్పు కనపడేలా పనులు చేయాలని ఆదేశించారు. ఆస్తిపన్ను, మున్సిపల్ షాపింగ్ కాం ప్లెక్సుల లీజుల మొండి బకాయిలను వెంటనే రాబట్టాలన్నారు. కార్యక్ర మంలో అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, రెవెన్యూ అధికారులు జునైద్, ఇజ్రాయేల్, వాజిద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారులపై ఆక్రమణల తొలగింపు: నగరంలోని రహదారులపై ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తున్న తోపుడు బండ్లు, హోర్డింగులు, బోర్డులు, స్టాళ్లు, వాహనాలను తొలగించేందుకు శనివారం నుంచి ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు కమిషనర్ పి.విశ్వనాథ తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. నగర వీధుల్లో అనధికారికంగా నిలిపిన తోపుడు బండ్ల కారణంగా వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక అధికారులు, సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

గణేశ్ మండపాలకు అనుమతి తప్పనిసరి



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేష్ నాయక్, చిత్రంలో సీఐ తబ్రేజ్, ఎస్ఐ చిరంజీవి, అధికారులు

గూడూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గణేశ్ మండపాలకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని గూడూరు తహసీల్దార్ వెంకటేష్ నాయక్, కోడుమూరు సీఐ తబ్రేజ్ అన్నారు. శనివారం గూడూరులోని తహసీల్దార్ కార్యాలయంలో గణేశ్ ఉత్సవాల నిర్వహణపై కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ చిరంజీవి, గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు జింకల కుమార్, రేమట సురేష్, సభ్యులు పాల్గొన్నారు.

సి.బెళగల్: గణేశ్ మండపాలు ఏర్పాటు చేసుకునే వారు గ్రామ సచివాలయంలో ఆన్‌లైన్‌లో చలానా కట్టి తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఎస్ఐ పరమేష్‌నాయక్ తెలిపారు. శనివారం సి.బెళగల్ పోలీసు స్టేషన్‌లో మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో రోడ్డుకు అడ్డంగా గణేశ్ మండపాలను ఏర్పాటు చేయకుండా చూడాలని, డీజేలకు అనుమతి లేదని అన్నారు. ఈసమావేశంలో హెడ్ కానిస్టేబుల్ ఆచారి, తిమ్మప్ప పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లకు సన్మానం



కాంట్రాక్టర్లను సన్మానిస్తున్న ఆదానీ సంస్థ ప్రతినిధులు

కల్లూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు బిల్డర్లు, కాంట్రాక్టర్లను ఆదానీ కంపెనీ సంస్థ ప్రతినిధి ఏడుకొండలు సన్మానించారు. శనివారం కర్నూలు నగరంలో నిర్వహించిన గౌరవ్ ఉత్సవ్ 2.0 మెగా కాంట్రాక్టర్ల సమావేశానికి ఏడుకొండలు హాజరై మాట్లాడారు. ఆదానీ సిమెంట్ ఉత్పత్తులు, ఆధునాతన సేవలపై కాంట్రాక్టర్లకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం సంస్థ ప్రతినిధులు, కాంట్రాక్టర్లను ఘనంగా సన్మానించారు.

రేపు నగర పాలక సర్వసభ్య సమావేశం

కర్నూలు అర్బన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఈనెల 25న నగర పాలక సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. ఈనెల 2న జరగాల్సిన సమావేశం అనివార్య కారణాలతో వాయిదా పడిందని, సోమవారం స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని నగర పాలక సంస్థలో ఉదయం 11 గంటలకు సమావేశం జరుగుతుందని, గత సమావేశంలో చర్చించని అంశాలపై పాలకవర్గం ఈ సమావేశంలో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

● సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు

● జీజీహెచ్‌లో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ డ్రైనేజీల శుభ్రం, నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో మురుగునీరు తొలగించాలని, ఆసుపత్రిలో పారిశుధ్యంపై పెస్ట్ కంట్రోల్ సిబ్బంది దృష్టి పెట్టాలని ఆదేశించారు. అనంతరం పెయింగ్ బ్లాక్ దగ్గర మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ సూప రింటెండెంట్ డాక్టర్ డి.శ్రీరాములు, సీఎస్ఆర్ఎంవో డా.వెంకటరమణ, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డా.పద్మజ పాల్గొన్నారు.

కర్నూలు మెడికల్ కాలేజీలో: కర్నూలు మెడికల్ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాలలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి వాటిలో మట్టి, కంకర వేసి పూడ్చారు. కళాశాలలో ఫాగింగ్, యాంటి లార్వా యాక్టివిటీ నిర్వహించి ప్రిన్సిపాల్ మొక్కలు నాటారు. ర్యాలీ అనంతరం ప్రిన్సిపాల్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌వోడీ డా.సుధాకుమారి, ప్రొఫెసర్ డా.ఎలిజిబెత్, ఎన్ఈఎస్ కార్యక్రమం అధికారి డా.అరుణ పాల్గొన్నారు.

జిల్లా వైద్యఆరోగ్య శాఖలో.. జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి. శాంతికళ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది. ముందుగా డీఎంహెచ్‌వో ప్రతిజ్ఞ చేయించారు. వర్షాకాలంలో కలిగే అనారోగ్య సమస్యలు, జాగ్రత్తలు అంశాలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. పీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్లు, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ఆఫీసు పరిపాలన అధికారి కే.అరు ణ, డీఐవో డా.నాగప్రసాద్ బాబు, డీపీవో డా.సంధ్యారెడ్డి, డెమో శ్రీనివాసుల శెట్టి, ఎస్‌వో హేమసుందరం, డీపీహెచ్ఎన్‌వో శారదామణి పాల్గొన్నారు.



వీకర్‌సెక్షన్ కాలనీలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో పాల్గొన్న టీడీపీ నాయకులు

పరిసరాల శుభ్రతకు కలిసికట్టుగా కృషి చేయాలి

కల్లూరు: నగరంలో పరిసరాల శుభ్రతకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని పాణ్యం టీడీపీ యువ నాయకుడు గౌరు జనార్దన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కల్లూరు మండలం నాయ కల్లు, కల్లూరు అర్బన్41వ వార్డు వీకర్‌సెక్షన్ కాలనీలో ఏపీ విశ్వబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కె.పార్వతమ్మతో కలిసి ఆయన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. గౌరు జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కె.పార్వతమ్మ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు కాలనీలను శుభ్రం చేసి సేవలందిస్తున్నారని, ప్రజలు కూడా వారికి సహకరించి బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దన్నారు. అలాగే నాయకల్లు గ్రామంలో చెత్త సంపద కేంద్రాలను గౌరు జనార్దన్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను ఆయన శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు వాకిటి మాదేష్, ఉలింద కొండ సింగిల్‌విండో అధ్యక్షుడు ఈవీరమణ, జనార్దనాచారి, కాసాని మహేష్‌గౌడ్, జవ్వాజి గంగాధర్‌గౌడ్, రాఘవేంద్రాచారి, నాగేశ్వరరావు, చరణ్‌యాదవ్, క్యాతూరు మధు, మండల అధికారులు పాల్గొన్నారు.

కర్నూలు అగ్రికల్చర్: ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని అమలు చేస్తోందని మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి అన్నారు. శనివారం కర్నూలు నగరంలోని సి.క్యాంపు రైతుబజారులో రైతులు, వ్యాపారులకు స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రపై అవగాహన కల్పించారు. ఏడీఎం నారాయణమూర్తి మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధాన్ని నూటికి నూరు శాతం అమలు చేయాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ డీఈ రఘునాథరెడ్డి, ఎస్టేట్ అధికారి కళ్యాణమ్మ, హార్టికల్చర్ అసిస్టెంట్ శివకుమార్, సెక్యూరిటీ గార్డులు పాల్గొన్నారు.

కర్నూలు కల్చరల్: స్వచ్ఛత అనే యజ్ఞంతోనే ఆరోగ్యమైన సమాజం సాధ్యమని నగర పాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ అన్నారు. శనివారం నగరంలోని డాక్టర్స్ కాలనీలోగల మున్సిపల్ పార్కులో 'స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ప్రతి పౌరుని బాధ్యత అని తెలిపారు.



కర్నూలు జీజీహెచ్‌లో మొక్క నాటుతున్న సూపరింటెండెంట్



ర్యాలీ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో, వైద్యులు

వ్యర్థాలను సక్రమంగా నిర్వహించడం, చేతుల పరిశుభ్రత, హైజీన్ పాటించడం, ఇంటి శుభ్రత, వ్యాధుల నివారణ, మరుగుదొడ్లు, కాలువలు శుభ్రపరచడం, నిలువ నీరు లేకుండా చూడడం వంటి అంశాలపై అవగాహన కల్పించాలని ఆశా వర్కర్లను కమిషనర్ ఆదేశించారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తపై పోస్టర్లను విష్కరించారు.

ఓర్వకల్లు: గ్రామాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలను నివారించుకోవచ్చని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని కాల్వ గ్రామంలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మాన్‌సూన్ హైజీన్ అనే థీమ్‌తో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ర్యాలీ, సదస్సులు, సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఖాదర్‌బాషా, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

సి.బెళగల్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో రాణెమ్మ అన్నారు. శనివారం మండల కేంద్రమైన సి.బెళగల్‌లో సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మహేశ్వరి, పంచాయతీ కార్యదర్శులు సునీల్‌రాణి, వెంకటేశ్వర్లు, సర్పంచ్ పాండు రంగన్న, టీడీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్, సోషల్ వెల్ఫేర్ అధికారి భాస్కర్ పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణ సమష్టి బాధ్యత



ప్రసంగిస్తున్న సులోచన

కర్నూలు కల్చరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల హక్కులను పరిరక్షించడంలో అందరూ సమష్టిగా కృషి చేయాలని అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది సులోచన అన్నారు. శనివారం బి.క్యాంపులోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఎస్సీ, ఎస్టీ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ నాగస్వామి నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యవక్తగా విచ్చేసిన న్యాయవాది సులోచన మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగం, పోలీసు శాఖ, ప్రజా ప్రతినిధుల, స్వచ్ఛంద సంస్థలు తమతమ వంతు బాధ్యతతో ఎస్సీ, ఎస్టీల హక్కులను కాపాడేందుకు కృషి చేయాలని అన్నారు. లీగల్ సర్వీసెస్ యూనిట్ సభ్యుడు రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ యాక్టు, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన కల్పించాలరు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. నాగస్వామి నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మురారి, అధ్యాపకులు రామకృష్ణ, విజయశేఖర్, సోమేష్, జబీన్ అక్తర్, ఉల్లోజిరావు, చిన్న మల్లేశ్వరుడు, శ్రీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లల్లో కంటి లోపాలను గుర్తించాలి

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పిల్లల్లో కంటి లోపాలను గుర్తించాలని కర్నూలు సుశీల నేత్రాలయ కార్నియా స్పెషలిస్టు డాక్టర్ పి. రాఘవ్ ప్రీతమ్ సూచించారు. నగరంలోని ఆర్‌టీసీ కాలనీ, ఎథీనా స్కూల్ లో సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ సుశీల నేత్రాలయ విద్యార్థులకు ఉచిత మెగా కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించింది. 3వేల మంది విద్యార్థులకు కంటి పరీక్షలను నిర్వహించగా, ఇందులో 300 మందికి దృష్టిలోపాలు ఉన్నట్లు గుర్తించారు. డాక్టర్ రాఘవ్ ప్రితమ్ మాట్లాడుతూ పిల్లల్లో సాధారణంగా కంటి సమస్యలను గుర్తించాలని, బ్లాక్‌బోర్డుపై అక్షరాలు సరిగ్గా కనప డకపో యిన వెంటనే కంటి వైద్యుల సాయం తీసుకోవాలని అన్నారు. కార్యక్ర మంలో ఎథినా స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతి, ఉపాధ్యాయులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రేపు సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో ఈ నెల 25న జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సీనియర్స్ బాలికల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు ఎం.కుబేర నాయుడు శనివారం తెలిపారు. జిల్లా స్థాయిలో క్రీడా నైపుణ్యాలను కనబరిచే సాఫ్ట్‌బాల్ బాలికల జట్టు ఆగస్టు 30 నుంచి 31 తేదీల్లో గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో 12వ రాష్ట్ర స్థాయి బాలికల సీనియర్స్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారిణులు 4 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఒరిజినల్ ఆధార్ కార్డుతోపాటు రూ.10 ప్రవేశ రుసుముతో ఈ నెల 25వ తేదీ ఉదయం 9 గంటలకు ఎంపికకు పాల్గొనాలని కోరారు. వివరాలకు 7032088008ను సంప్రదించాలని సూచించారు.

మాల సామాజిక వర్గానికి అన్యాయం



మాట్లాడుతున్న రత్నాకర్

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో మాల సామాజిక వర్గానికి పూర్తిగా అన్యాయం జరుగుతుందని నేషనల్ ప్రెసి డెంట్ ఫర్ రాక్స్ అండ్ మాలమహానాడు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గాన్ని మోసం చేస్తున్నాయన్నారు. అన్ని శాఖల్లో ఎస్సీ వర్గీక రణతో పదవులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో బాలముని, ము నెమ్మ, ధనుష్, గోవర్ధన్, అంజలి పాల్గొన్నారు.

మహిళా రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలి

సి.బెళగల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మహిళా రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలని కోడుమూరు నియోజకవర్గ లీగల్ మేనేజర్ పాండు అన్నారు. శనివారం మండల వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పొదుపు గ్రూపుల్లో ఉన్న మహిళా రైతులు ఆర్థికం గా ఎదిగేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక రుణ సౌకర్యం కల్పిస్తుం దన్నారు. సమావేశంలో ఏపీఎం రమేష్, సీసీలు రాముడు, గోవిందు, మహిళా రైతులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయాలకు పోటెత్తిన భక్తులు



కొమ్ముచెరువులో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ఓర్వకల్లు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్ముచెరువు, కాల్వ, భైరాపురం గ్రామాల్లో వెలసిన ఆంజనేయస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. శనివారం అమావాస్య పర్వదినం కావడంతో భక్తులు అధిక సం ఖ్యలో తరలివచ్చారు. కొమ్ముచెరువు ఆంజనేయస్వామి ఆలయానికి జిల్లా లోని వివిద ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఆంజనేయ స్వామికి ఆకు పూజలు చేశారు. భక్తులు కాయకర్పూరాలు సమర్పించి మొ క్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సాం స్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

కర్నూలు కల్చరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య పేరును కర్నూలు జిల్లాకు పెట్టాలని కోరుతూ దామోదరం సంజీవయ్య జిల్లా సాధనా సమితి నాయకులు శనివారం నగరంలో కరపత్రాల పంపిణీ, సంతకాల సేకరణ కార్యక్రమాలను నిర్వహించారు. నగరంలోని బిర్లా కాంపౌండ్ సమీపంలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నగరంలోని ఖానా ఖజానా, కొత్త బస్టాండు, బుధవారపేట, కలెక్టరేట్ రోడ్డు, బిర్లా కాంపౌండు తదితర ప్రాంతాల్లో కరపత్రాలు పంపిణీ చేస్తూ నగర పౌరులతో సంతకాలు సేకరణ చేపట్టారు. సమితి గౌరవాధ్యక్షుడు నక్కలమిట్ట శ్రీనివాసులు మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య పేరును కర్నూలు జిల్లాకు పెట్టాలని అనేక దశాబ్దాలుగా కోరుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. సమితి ఇతర ప్రతినిధులు జేవీ కృష్ణయ్య, రామశేషయ్య, దామో దరం రాధాకృష్ణమూర్తి, నాగభూషణం, సీవీ వర్మ, ప్రేమ్‌కుమార్ రెడ్డి, గోవర్ధన్ పాల్గొన్నారు.

'స్త్రీ శక్తి'పై వైసీపీ తప్పుడు ప్రచారం

కర్నూలు అర్బన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకంపై వైసీపీ తప్పుడు ప్రచారాలు చేస్తోందని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు నూరి మన్సూర్ అలీఖాన్ అన్నారు. శనివారం మంత్రి టీజీ భరత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా స్త్రీ శక్తి పథకం విజయవంతంమైందన్నారు. ఇప్పటివరకు దాదాపు కోటి మందికి పైగా మహిళలు ఈ పథకం వల్ల లాభం పొందారన్నారు. కూటమి ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే ఓర్వలేక వైసీపీ నేతలు సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో శాంతమ్మ, షేక్ పర్హానా, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఘనంగా టంగుటూరి జయంతి



ప్రభుత్వ ఒకేషనల్ కాలేజీలో టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం పంతుల జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రకాశం పంతులు ఆంధ్ర రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ప్రసన్నకుమార్, వాణిప్రసన్న, రామకృష్ణ, విజయశేఖర్, మల్లికార్జున పాల్గొన్నారు.

కర్నూలు అర్బన్: స్వాతంత్ర్య సమయంలో బ్రిటిష్ వారి తుపాకీ గుళ్లకు ఎదురు నిలిచిన ధైర్యశాలి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులని సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు జిలానీ బాషా అన్నారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టంగుటూరి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, బజారన్న, ఖాజా హుసేన్, లాజరస్, ఆర్ ప్రతాప్, సత్యరాజు పాల్గొన్నారు.



ప్రకాశం పంతులుకు నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

డీఎస్సీ ఫలితాల్లో 'ప్రతిభ'



డీఎస్సీలో ప్రతిభ చూపిన వారితో డైరెక్టర్ అరుణాచలంరెడ్డి

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఏపీ మెగా డీఎస్సీ పరీక్షా ఫలితాల్లో కర్నూలు ప్రతిభ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన అభ్యర్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర స్థాయి ర్యాంకులతో పాటు అత్యధికంగా ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించినట్లు ప్రతిభ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ అరుణాచలంరెడ్డి పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు 400కు పైగా ఉన్నారన్నారు. ఎస్జీటీలో నగరానికి చెందిన విజయ శశికళ 87.481 మార్కులతో సత్తా చాటారు. నాగరాజు, స్కూల్ అసిస్టెంట్ బయాలజీలో 85.678 మార్కు లు, వై.సుభాషిణి, స్కూల్ అసిస్టెంట్ బయాలజీ 81.35 మార్కులతో జిల్లా ప్రథమ స్థానంలో సాధించారన్నారు. వెంకటేశ్వర నాయక్ ఎస్ఏ గణితంలో 75.664 మార్కులు, సుమలత ఎస్ఏ సోషల్‌లో 81.705 మార్కులు, ఎన్.చంద్రకళ 71.7 మార్కులు సాధించి అగ్ర స్థానంలో నిలిచారన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో విజయం సాధించిన అభ్యర్థులను అరుణాచలంరెడ్డి అభినందించారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి గ్రామాల్లో ఇంటింటి సర్వే

● పాడిగేదెల వివరాలు, ఆదాయంపై అవగాహన

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం గ్రామాల్లో ఇంటింటి సర్వే చేపట్టనుంది. వివిధ పథకాలను అమలు చేయడంతో పాటు ఆ పథకాల ద్వారా రైతులకు వచ్చే లాభాలపై కూడా అవగాహన కల్పించనున్నారు. పాడి పశువు లున్న కుటుంబాల్లో పశుసంవర్ధక శాఖ యంత్రాంగం ఇంటింటికి సర్వే చేపట్టింది. గతంలో పశుగణన సమయంలో గుర్తించిన రైతుల ఇళ్లకు వెళ్లి ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. పశువులు, జీవాలు, కోళ్లు, పెంచుతున్న రైతుల నుంచి 9 అంశాలకు సంబంధించి 35 ప్రశ్నల ద్వారా సమాధానాలు రాబడుతున్నారు. జూలై 25న ప్రారంభమైన ఈ సర్వే సెప్టెంబరు 15లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ జేడీలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ సర్వే ద్వారా ఆ శాఖ సిబ్బంది పలు వివరాలు సేకరిస్తున్నారు. ఎన్ని పశువులు ఉన్నాయి.. వాటి ద్వారా వస్తున్న ఆదాయం ఎంత.. పశుకిసాన్ క్రెడిట్ కార్డు పొంది ఉంటే దాని ద్వారా బ్యాంకు రుణం పొందారా లేదా, రుణం పొందిన వారు ఏ మేరకు ఆ రుణాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ వివరాల ద్వారా రానున్న రోజుల్లో పాడి పరిశ్రమవృద్ధికి మరిన్ని పథకాలు, కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉందని పశుసంవర్ధక శాఖ జేడీ శ్రీనివాస్ తెలిపారు.

మెడికవర్‌లో కిడ్నీ మార్పిడి ఆపరేషన్

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరుకు చెందిన 32 ఏళ్ల ఆదినారాయణకు కర్నూలు మెడికవర్ హాస్పిటల్‌లో వైద్యులు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ ఆపరేషన్‌ను చేసి ప్రాణాన్ని నిలబెట్టారు. కోవెలకుంట్ల మండ లం కొప్పర్ల గ్రామానికి చెందిన రామసుబ్బయ్య (39) ప్రమాద వశాత్తు రోడ్డు ప్రమాదంలో గాయపడి మెడికవర్ హాస్పిటల్‌లో ఆగస్టు 12వ తేదీ బ్రెయిన్ డెడ్ అయ్యాడు. దీంతో ఆయన బంధువులు అవయవ దానానికి అంగీకరించారు. జీవన్‌దాన్ ద్వారా పేరు నమోదు చేసుకున్న ఆదినారాయణకు ఆగస్టు 13వ తేదీన కిడ్నీలో 30 సెంటిమీట్ల నీటి బుడగలు, కిడ్నీవాపు ఉండటంతో నెఫ్రెక్టమి ఆపరేషన్ ద్వారా కన్సల్టెంట్ యురాలజిస్టు డా.అబ్దుల్ సమద్ కిడ్నీని తొలగించి అవయవదానం చేసిన కిడ్నీని అమర్చారు. రోగి కోలుకోవడానికి సహకరించిన నెఫ్రాలజిస్టు డా.సిద్ధార్థ్ హెరూర్, యూరాలజిస్టు డా.అబ్దుల్ సమద్, మూత్రపిండ మార్పిడి ఫిజీషియన్ డా.బి.ప్రవీణ్, డా.విజయసాయి, డా.రేష్మ, అనస్థీషియా వైద్యులు డా.శరత్, డా.అమ రసింహ, ఐసీయూ నర్సింగ్ స్టాఫ్‌కు మెడికవర్ హాస్పిటల్ క్లస్టర్ హెడ్ మహేశ్వరరెడ్డి అభినందనలు తెలిపారు.

చెక్కు అందజేత

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రుద్రవరం గ్రామానికి చెందిన ఉపాధి కూలీ అన్నెల దాను జనార్దన్ విద్యుదాఘాతంతో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులకు ఎయిర్‌టెల్ బ్యాంకు పేమెంటు సంస్థ ద్వారా రూ.2 లక్షల చెక్కును శనివారం అందజేశారు. డ్వామా పీడీ వెంకటరమణయ్య మాట్లాడుతూ వలస ప్రభావిత ప్రాంతాల్లో ఏటా ఉపాధి పనులు కల్పిస్తున్నామన్నారు. కూలీల భద్రత కోసం ప్రభుత్వం కల్పించే బీమాతో పాటు ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకులో అకౌంటు కలిగి ఉండే అదనంగా ప్రమాద బీమా కింద రూ.2లక్షలు ఆర్థిక సాయం లభిస్తుందన్నారు. బీమా చేసుకోవడం వల్ల కుటుంబాలకు భరోసా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో వేణు, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు జోనల్ మేనేజర్ నవీన్‌శెట్టి, వీరారెడ్డి పాల్గొన్నారు.

ఆవుల దాడిలో మరో వృద్ధుడి మృతి

ఆలూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆవుల దాడిలో గాయపడి చికిత్స పొందు తున్న వృద్ధుడు బుగులు ఆంజనే యులు (80) శనివారం మృతిచెందాడు. వీధిలో నివాసముంటున్న వృద్ధుడిపై 15 రోజుల క్రితం సంత మార్కెట్ సమీపంలో ఆవులు దాడి చేశాయి. కాగా ఇప్పటికే పద్మనాభ దాస్ అనే వృద్ధుడు మృతిచెందిన విషయం విదితమే. అధికారులు స్పందించి ఆవులను తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

స్వచ్ఛాంధ్ర లక్ష్యంగా సాగుదాం



ప్రతిజ్ఞ చేస్తున్న కమిషనర్ కృష్ణ, చైర్ పర్సన్ లోకేశ్వరి

ఆదోని టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర లక్ష్యంగా ముందుకు సాగాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణ, చైర్‌పర్సన్ సీహెచ్ లోకేశ్వరి సూచించారు. శనివారం పట్టణంలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర ర్యాలీ నిర్వహించారు. కోట్ల సర్కిల్‌లో కమిషనర్ సిబ్బంది, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మున్సిపల్ పాఠశాల మైదానంలో మొక్కలు నాటారు. హెల్త్ ఆఫీసర్ డా. సందీప్ కుమార్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్క నాటుతున్న గుడిసె కృష్ణమ్మ

ఆదోని, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మొక్కలను నాటి, వాటిని సంరక్షించాలని, పర్యావరణ పరిరక్షణ బాధ్యతగా గుర్తించాలని టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె కృష్ణమ్మ సూచించారు. శనివారం మండిగిరి గ్రామ పంచాయతీ పరిధిలో డీఎల్‌పీవో తిమ్మక్క, కార్యదర్శి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. మాజీ ఎంపీపీ మురళి, శ్రీనివాస్‌చౌదరి, అనిమిరెడ్డి, బాబురావు, నాగన్న, దేవేంద్ర, జనసేన నాయకులు ప్రకాష్ పాల్గొన్నారు.

రాజీ మార్గంలో పరిష్కరించుకోండి



మాట్లాడుతున్న న్యాయాధికారి యజ్ఞ నారాయణ

ఆదోని రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : కక్షిదారులు కోర్టు చుట్టు తిరగకుండా పరస్పరం రాజీ చేసుకోవాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి యజ్ఞ నారాయణ సూచించారు. శనివారం విరూపాపురంలో విజ్ఞాన సదస్సు నిర్వహించారు. క్షణికావేశంలో గొడవలకు పాల్పడవద్దన్నారు. రూరల్ ఎస్ఐ రామాంజనేయులు ఉన్నారు.

యూరియా విక్రయానికి లింకు పెట్టకూడదు

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): దుకాణదారులు యూరియా విక్రయాలకు లింకు పెట్టకూడదని తహసీల్దార్ రమేష్ సూచించారు. శనివారం ఏవో సుధాకర్‌తో కలిసి పట్టణంలోని ప్రైవేటు పెస్టిసైడ్ దుకాణాలను తనిఖీ చేశారు. ఇతరమైనవి కొంటేనే యూరియా విక్రయిస్తామని రైతులకు లింకు అంటకడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువుల కొరత లేదని రైతుల ఆందోళన చెందవద్దన్నారు. విస్తరణ అధికారి సతీష్ పాల్గొన్నారు.



స్టాక్‌ను తనిఖీచేస్తున్న తహసీల్దార్ రమేష్

రైతులందరికీ యూరియా ఇస్తాం

తుగ్గలి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రైతులందరికీ యూరియా ఇస్తామని ఏవో సురేష్ యాదవ్, సర్పంచ్ చౌడప్ప అన్నారు. శనివారం బొందిమడుగుల గ్రామాల్లో యూరియాను పంపిణీ చేశారు. యూరియాను తగిన మోతుదులోనే వాడాలన్నారు. నానో యూరియాను వినియోగిస్తే పంటలు బాగుంటాయన్నారు. ఏఈవోలు లక్ష్మీనారాయణ, మల్లేష్, ప్రతాప్ యాదవ్ ఉన్నారు.

రేపు కలెక్టరేట్ వద్ద ధర్నా

మద్దికెర ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రజకుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 25న కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు చిరంజీవి తెలిపారు. శనివారం మద్దికెరలో కరపత్రాలు పంపిణీ చేశారు. జీవో.నెం.27 ప్రకారం దోబీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

తుగ్గలి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కడమకుంట్ల గ్రామ శివారులో శనివారం పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. 8 మందిని అదుపులోకి తీసుకుని రూ. 18,400లు స్వాదీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

హొలహర్వి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎస్ఐ మారుతి సూచించారు. శనివారం మాట్లాడుతూ ప్రతి విగ్రహం వద్ద క్యూఆర్ కోడ్ అమలు చేస్తామన్నారు. గ్రామాల్లో అల్లర్లు, గొడవలు జరగకుండా ముందుగా పెద్దల సమక్షంలో చర్చించిన అంతరమే వినాయక విగ్రహాలను కూర్చోబెట్టాలన్నారు



ఎస్ఐ మారుతి

పట్టుపట్టారు సాధించారు

- డీఎస్సీలో సత్తా చాటిన అభ్యర్థులు
- పలువురు కూలీల కుటుంబీకులే



ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాలకు చెందిన అభ్యర్థులు డీఎస్సీలో ప్రతిభ చాటారు. కొందరు పనులు చేసుకుంటూ సిద్ధపడగా, మరికొందరు ప్రైవేటు ఉపాధ్యాయులుగా పనిచేస్తూ ర్యాంకు సాధించారు. ఇక వీరు ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం లాంఛనమే.
- ఆదోని అగ్రికల్చర్, మద్దికెర, ఆస్పరి, దేవనకొండ

తల్లిదండ్రులు మృతిచెందినా దుఃఖాన్ని దిగమింగుకుని..



ఎ.మహరాజు

ఎన్ని ఆటంకాలు ఎదురైన అనుకున్నా లక్ష్యానికి చేరుకున్నారు. టీచర్ ఉద్యోగం సాధించాలన్న తపనతో రోజుకు 12 నుంచి 16 గంటల పాటు చదివి పట్టుబట్టి సాధించారు. ఆదోని పట్టణంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి నగర్‌కు చెందిన లేట్ తమ్మారెడ్డి, వెంకటలక్ష్మి కుమారుడు ఎ.మహరాజు స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్) 76.45 మార్కులు సాధించి జిల్లాలో ఏడో ర్యాంకు సాధించారు. తల్లిదండ్రులు రెండేళ్ల క్రితమే మృతి చెందినా దుఃఖాన్ని దిగమించుకొని సెంట్రింగ్ పని చేస్తున్న తమ్ముడు విష్ణు బాధ్యతను మోశాడు. ఆర్‌ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రమేష్ నాయుడు సూచన మేరకు సబ్జెక్టు బోధిస్తూ సాయంత్రం ట్యూషన్ చెబుతూ కుటుంబాన్ని పోషించుకొని కోచింగ్ తీసుకోకుండానే పోస్టు వచ్చిందన్నారు

ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తూ..



సుమంత్

ఇందిరానగర్ కాలనీకి చెందిన హుసేనీ పవులమ్మ కుమారుడు మాధవరం సుమంత్ డీఎస్సీ లో స్కూల్ అసిస్టెంట్ (గణితం) జిల్లాలో ఎనిమిదో ర్యాంకు సాధించారు. బీటెక్ పూర్తిచేసి ఉపాధ్యాయుడు కావాలన్న సంకల్పంతో బీఈడీ చదువుకున్నారు. తల్లిదండ్రులు కూలీ చేసుకుని ఆ కష్టాన్ని చూసి ప్రైవేటు పాఠశాలలో చదువు చెబుతూ రోజుకు 10గంటలు పాటు కష్టపడి కొలువును సాధించారు.

30వ ర్యాంకు సాధించిన భగవంతప్ప



డీఎస్సీ ఫలితాల్లో ఆస్పరి మండలంలోని కలపరి గ్రామానికి చెందిన యువకుడు గంజల్ల భగవంతప్ప జిల్లాలో 30వ ర్యాంకు సాధించాడు. గొర్రెల కాపరిగా ఉంటూ కుటుంబానికి ఆసరాగా ఉండి చదివి ర్యాంకు సాధించడంతో గ్రామస్తులు అభినందించారు.

డీఎస్సీలో మెరిసిన ఆణిముత్యాలు



తల్లిదండ్రులతో కుంకనూరుకు చెందిన హనుమంతు



చంద్రశేఖర్ హరికృష్ణ

దేవనకొండ మండలంలోని యువకులు డీఎస్సీ ఫలితాల్లో మెరిశారు. కుంకనూరు గ్రామానికి చెందిన బసవరాజు, సుశీలమ్మ కుమారుడు హనుమంతు ఎస్‌జీటీలో 92.63 మార్కులతో జిల్లాలో మూడో ర్యాంకు సాధించాడు. అలాగే పి.కోటకొండకు చెందిన దేవరబండ వెంకటేష్, లక్ష్మిదేవి దంపతుల కుమారుడు చంద్రశేఖర్ ఎస్‌ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో 89 మార్కులతో జిల్లాలో మొదటి ర్యాంకు సాధించాడు. అదే గ్రామానికి చెందిన పొక్కుల వెంకటేష్, లక్ష్మిదేవి కుమారుడు హరికృష్ణ ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో 88 మార్కులతో జిల్లా మూడో ర్యాంకు సాధించాడు.

శభాష్ పురుషోత్తం



తల్లిదండ్రులతో పురుషోత్తం

మద్దికెర మడలం ఎడవలి గ్రామానికి చెందిన చంద్రశేఖర్, పారిజాతమ్మ దంపతుల కుమారుడు పురుషోత్తం డీఎస్సీలో మూడు పోస్టులు సాధించారు. స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్‌లో జిల్లాలో 5వ ర్యాంకు, టీజీటీ జోనల్‌లో జిల్లాలో 4వ ర్యాంకు, ఎస్‌జీటీలో జిల్లాలో 17వ ర్యాంకు సాధించి మూడు పోస్టులకు అర్హులుగా ఎంపికయ్యాడు. తాను ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిచ. మద్దికెర విద్యాసాయి కళాశాలలో ఇంటర్ శంకరానంద కాలేజీలో డిగ్రీ టీటీసీ, తాడిపత్రిలో బీఈడీ పూర్తి చేశానన్నారు. తాను స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్) పోస్టుకు ప్రాధాన్యమిస్తానని తెలిపారు.

వినాయక చవితిని ప్రశాంతంగా చేసుకోవాలి

- డీఎస్పీ వెంకట్రామయ్య
- హొళగుంద, ఆలూరులో సమావేశం



హొళగుందలో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట్రామయ్య

హొళగుంద, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితిని ప్రశాంతంగా చేసుకోవాలని పత్తికొండ డీఎస్పీ వెంకట్రారామయ్య సూచించారు. శనివారం హొళగుందలో గ్రామ పెద్దలతో సమావేశం ఏర్పాటు చేశారు. పోలీసుల అనుమతి తీసుకున్న అనంతరమే మండపాలు ఏర్పాటు చేసుకోవాలని, అనుమతి లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిమజ్జనం రోజు ప్రజలను ఇబ్బందులు పెట్టేలా ప్రవర్తించరాదన్నారు. సూచించారు. ఆలూరు సీఐ రవిశంకర్ రెడ్డి తహసీల్దార్ నిజాముద్దీన్, హొళగుంద ఎస్ఐ దిలీప్‌కుమార్ గురజాల పాల్గొన్నారు.

ఆలూరు: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ, సీఐ రవిశంకర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ గణేశ్ ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో ప్రశాంతంగా చేసుకోవాలన్నారు. విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పక తీసుకోవాలని, విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నిమజ్జనం రోజున మద్యం సేవించకుండా సాయంత్రంలోపే పూర్తి చేయాలన్నారు. ఎస్ఐ మహబూబ్‌బాషా, మతపెద్దలు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

హొళగుంద , ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆందోళన చెందవద్దని అవసరం మేరకు యూరియా పంపిణీ చేస్తామని తహసీల్దార్ నిజాముద్దీన్, ఏఈ ఆనంద్ లోకాదళ్ అన్నారు. శనివారం ఎరువుల దుకాణాలను పరిశీలించారు. ఎల్లార్తి రైతు సేవా కేంద్రం ద్వారా రైతులకు యూరియా పంపిణీ చేసినట్లు తెలిపారు. ఎకరాకు బస్తా చొప్పున ఇప్పటికే పంపిణీ చేశామన్నారు. యూరియా రాగానే మళ్లీ పంపిణీ చేస్తామన్నారు.

సరుకులు సక్రమంగా అందించాలి

దేవనకొండ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కార్డుదారులకు డీలర్లు సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని ఆర్డీవో భరత్‌నాయక్ సూచించారు. శనివారం దేవనకొండలోని 16వ రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు.ఈ పాస్ యంత్రంలోని నిల్వ, దుకాణంలోని స్టాకు సరిగా ఉండాలన్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ అమీనాబేగం, వీఆర్వో రాజన్న ఉన్నారు.



తనిఖీ చేస్తున్న ఆర్డీవో భరత్ నాయక్

మొక్కలు నాటితే పచ్చదనం

పత్తికొండ టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి పచ్చదనానికి ప్రాధాన్యమివ్వాలని ఆర్డీవో భరత్‌నాయక్ సూచించారు. శనివారం పత్తికొండలో పంచాయతీ ఈవో నరసింహులు ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛతా దివస్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగు స్తంభాల కూడలిలో మొక్కలు నాటారు. ఎంపీడీవో కవిత, సర్పంచ్ కొమ్ము దీపిక పాల్గొన్నారు.

టీడీపీలో కార్యకర్తలకు ధీమా



చెక్కులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

దేవనకొండ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీలోనే కార్యకర్తలకు ధీమా ఉంటుందని ఆ పార్టీ కన్వీనర్ విజయబాస్కర్ గౌడ్, మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు అన్నారు. కె.వెంకటాపురం గ్రామానికి చెందిన గోకారి, కరిడికొండ గ్రామానికి చెందిన వెంకటేష్ మృతి చెందడంతో, వారికి పార్టీ సభ్యత్వం ఉండటంతో రూ.5లక్షల చొప్పున బీమా మంజూరైంది. శనివారం పార్టీ కార్యాలయం వద్ద బాధిత కుటుంబసభ్యులకు చెక్కులు పంపిణీ చేశారు. మల్లికార్జున గౌడ్, రాజశేఖర్ గౌడ్, రామరావునాయుడు, ఉచ్చీరప్ప, సర్పంచ్‌హనుమంతు, శాంతి, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



చిన్నారికి టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

మద్దికెర ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారి రాగిణి సూచించారు. శనివారం కస్తూర్బా పాఠశాలలో టీకాలు వేశారు. ఈ టీకాలతో వ్యాధి నిరోధక శక్తి పెరిగి, ధనుర్వాతం, కంటి సర్పి వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి, వైద్యసిబ్బంది నిరంజన్ బాబు, అక్బర్ బాషా ఉన్నారు.

అనర్హుల పింఛన్లనే తొలగించారు

తుగ్గలి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అనర్హుల పింఛన్లనే తొలగించామని, వైసీపీ నాయకుల ఆరోపణలు అవాస్తవ మని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు వరలక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షులు తిరుపాల్ నాయుడు అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ సదరం క్యాంపులో పర్సంటేజీలు తక్కువగా రావడంతోనే పింఛన్లు రద్దు అయ్యాయన్నారు. గత వైసీపీ హయాంలో వైకల్యం లేకున్నా పింఛన్లు పొందారని ఆరోపించారు. అర్హులవి తొలగించి ఉంటే పరిశీలించి న్యాయం చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారన్నారు.

కమ్యూనిటీ ఆర్గనైజర్ మృతి

ఆదోని రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయంలో కమ్యూనిటీ ఆర్గనైజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.లక్ష్మన్న(50) శనివారం మృతి చెందాడు. వివరా లమేరకు.. గత మంగళవారం విధి నిర్వహణలో కుప్పకూడంతో సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషమంగా ఉండడంతో వైద్యుల సూచనల మేరకు కుటుంబ సభ్యులు కర్నూలుకు తరలించారు. శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు.

పరిశుభ్రత పాటించాలి

వెల్దుర్తి/టౌన్ ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో సుహాసినమ్మ సూచించారు. శనివారం రామళ్లకోటలో స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు కడుక్కోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ బాలచంద్రారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో రవికిశోర్, సర్పంచ్ నిర్మల, ఏపీవో లక్ష్మన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మునెయ్య ఉన్నారు.

రోడ్లపై పరీక్షలు సరికాదు

ఆదోని టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఓ ఫార్మా కంపెనీ సిబ్బంది రోడ్డుపైనే రక్త పరీక్షలను నిర్వహించడం సరికాదని మైనార్టీ సమితి కార్యదర్శి నూర్ అహ్మద్ అన్నారు. శనివారం మాట్లాడుతూ శుభ్రమైన ప్రదేశంలో చేయాలన్నారు.

ప్రశాంతంగా చేసుకోవాలి

ఆదోని రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా చేసుకోవాలని పెద్దతుంబళం ఎస్ఐ మహేష్ కుమార్ సూచించారు. శనివారం పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చిగిలి బాధితులకు ఆర్డీటీ సాయం



నిత్యావసర వస్తువులు ఇస్తున్న దాతలు

ఆస్పరి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న ఆస్పరి మండలం చిగిలి గ్రామంలో చిన్నారులను పోగొట్టుకున్న బాధితులకు రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్డీటీ) సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. శనివారం బసినేపల్లి గ్రామానికి చెందిన గ్రామ స్వరాజ్ సభ్యులు కుటుం బాలను పరామర్శించి నిత్యావసర వస్తువులు అందజేశారు. ఆర్డీటీ ఏపీసీ ధనుంజయ, సీవో దుర్గాప్రసాద్, గంగాధర్ మాట్లాడుతూ చినారుల మృతి బాధాకరమని వారికి మనోధైర్యం కల్పించాలని, ప్రభుత్వం కూడా సాయం చేయాలన్నారు. బసినేపల్లి గ్రామస్థులు ప్రతాప్, గంగన్న, చిట్టిబాబు, శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలి

ఆదోని రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అంగన్ వాడీ కేంద్రంలో పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని ఎంపీడీవో జనార్ధన్ సూచించారు. శనివారం పెద్దహరివాణం అంగన్‌వాడీ కేంద్రం, సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామాన్ని శుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం ప్రభుత్వ కార్యాలయాల వద్ద మొక్కలు నాటారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

'సురవరం'కు నివాళి



పత్తికొండలో నివాళి అర్పిస్తున్న నాయకులు

పత్తికొండ టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సీపీఐ పూర్వ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డికి శనివారం పత్తికొండలో సీపీఐ నాయకులు నివాళి అర్పించారు. స్థానిక సి.ఆర్.భవన్‌లో రైతుసంఘం నాయకుడు వెంకటరామిరెడ్డి, దూదేకొండ ఎంపీటీసీ ఈరన్న, ఏఐటీయూసీ కార్యదర్శి రంగన్న మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఉద్యమాలకు నాందీ పలికారన్నారు. తుదిశ్వాస వరకు ఎర్రజెండా నీడలో ఉన్నాని మృతి పార్టీకి తీరనిలోటన్నారు. రాజప్ప, ఉచ్చన్న, నరసింహులు, పరశురాముడు తదితరులు పాల్గొన్నారు.

'సురవరం' మృతి సీపీఐకి తీరనిలోటు

ఆదోని రూరల్: సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పార్టీకి తీరనిలోటని బసాపురం గోపాల్, కల్లుబావి రాజు అన్నారు. శనివారం పార్టీ చిత్రపటానికి నివాళి అర్పించారు.

స్వచ్ఛతకు కృషి చేయాలి

దేవనకొండ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో స్వచ్ఛతకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని డీఎల్‌డీవో రామచంద్రారెడ్డి సూచించారు. శనివారం పంచాయతీ కార్యాలయం నుంచి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. దోమలు వ్యాప్తి చెందకుండా సిబ్బంది రోజూ పారిశుధ్య పనులు చేయాలన్నారు. దేవనకొండలో పందుల సంచారం అధికంగా ఉందని గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో వారంలోనె పందులను తరలించాలని పెంపంకం దారులకు సూచించారు. కరివేములలో సర్వేను తనిఖీచేసి, వారంలోగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. డిప్యూటీ ఎంపీడీవో గోపాల్, తదితరులు ఉన్నారు.

పర్యావరణాన్ని కాపాడండి

మద్దికెర ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎంపీడీవో స్వర్ణలత, డిప్యూటీ ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంపీపీ అనిత, సర్పంచ్ బండారు సుహాసిని సూచించారు. శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో కార్యాలయ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. రైతులు పండ్ల తోటల పెంచితే ప్రభుత్వం రాయితీ కింద మొక్కలు ఇస్తుందన్నారు. చెట్లను నరకడం నేరమని, రోడ్డుకిరువైపులా మొక్కలను నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివకుమార్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

పునరుద్ధరించాలి

పత్తికొండ టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తొలగించిన పింఛన్లను పునరుద్ధరించాలని సీపీఎం నాయకుడు వెంకటేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. డాక్టర్ సర్టిఫికెట్ ఆధారంగా పొందుతున్న పింఛన్లను రీ వెరిఫికేషన్ పేరుతో తొలగించడం అన్యాయమన్నారు. అనంతరం ఎంపీడీవో కవితకు వినతి పత్రం సమర్పించారు. నాయకులు రవిచంద్ర, నరసన్న, రామాంజనేయులు ఉన్నారు.

అందరి సహకారంతో గ్రామాభివృద్ధి

తుగ్గలి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఇన్‌చార్జి ఎంపీడీవో మహబూబ్ బాషా, డిప్యూటీ ఎంపీడీవో హరి పేర్కొన్నారు. శనివారం చెన్నంపల్లిలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా పారిశుధ్య పనులను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించి, తడి, పొడి చెత్త వేరుచేయాలని కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యదర్శి కార్తీక్ రంగనాథ్, అక్బర్ తదితరులు ఉన్నారు.



చెన్నంపల్లిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న అధికారులు

ఎరువుల దుకాణాల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఏవో సరిత

నందవరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కోరమాండల్ ఎరువుల దుకాణాన్ని, ఫర్టిలైజర్ షాపులను శనివారం వ్యవసాయ అధికారి సరిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల మందుల స్టాక్‌ను, రికార్డులను పరిశీలించారు. రైతులకు ఇచ్చే ఆన్‌లైన్ రసీదులను పరిశీలించారు. కాలం చెల్లిన మందులు ఏమైనా అమ్ముతున్నారేమోనని మందులను పరిశీలించారు. రైతులకు అనవసరమైన మందులు అంటగడితే చర్యలు తప్పవన్నారు. కాలం చెల్లిన మందులు అమ్మితే దుకాణం సీజ్ చేస్తామన్నారు.

వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలి

కౌతాళం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27న జరిగే వినాయక చవితి పండుగను అందరూ కలిసిమెలిసి సంతోషంగా జరుపుకోవాలని కౌతాళం సీఐ అశోక్ కుమార్ తెలిపారు. కౌతాళం పోలీస్ స్టేషన్‌లో శనివారం మండలంలోని అందరు మత పెద్దలతో, గ్రామస్థులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మండలంలో గణపతి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం వినాయక మంటపాలకు అనుమతులు తీసుకోవాలని సూచించారు. అనంతరం విశ్వహిందూ పరిషత్ మండల నాయకుడు మారుతి మోహన్, కౌతాళం సొసైటీ అధ్యక్షులు వెంకటపతిరాజు మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో వినాయక చవితి పండుగను అన్ని మతస్థులతో కలసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్వహించుకున్నామని ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా హిందూ ముస్లింలు అన్నదమ్ముల్ల కలిసి జరుపుకుంటామని తెలిపారు. సమావేశంలో దాట్ల సుబ్బరాజు, సౌద్రి బసవరాజు, రాఘవేంద్ర రెడ్డి, ఉప్పరహాల్ ఏకాంబిరెడ్డి, ఇశాక్ సాబ్, ఖాజ హుసేన్, డాక్టర్ రాజానందు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు వాసికి డాక్టరేట్



విజయానంద్

ఎమ్మిగనూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని సెయింట్ జాన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో హ్యూమానిటీస్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఎమ్మిగనూరు వాసి విజయానంద్‌కు రాయలసీమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసింది. 'ది ఇష్యూస్ ఆఫ్ వయలెన్స్ ఎక్స్‌ప్లాయిటేషన్ అండ్ పవర్ ఇన్ ది ప్లేస్ ఆఫ్ విజయ్ టెండూల్కర్ అనే అంశంపై పరిశోధన చేయడంతో వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ మేరకు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో విజయానంద్‌ను ఘనంగా సన్మానించారు. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ధరకు విక్రయిస్తే చర్యలు



రికార్డును తనిఖీ చేస్తున్న తహసీల్దార్ వేణుగోపాల్

కోసిగి ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫర్టిలైజర్స్ షాపులలో అధిక రేట్లకు రైతులకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు. కోసిగిలోని ఫర్టిలైజర్స్ దుకాణాలను, రికార్డులను పరిశీలించి గోడౌన్‌లో ఎరువుల నిల్వలను పరిశీలించారు. మండల వ్యవసాయాధికారి వరప్రసాద్‌తో కలిసి పలు ఫర్టిలైజర్స్ షాపుల యజమానులకు తెలియజేస్తూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు రైతులకు అమ్మాలని అధిక ధరలకు ఎరువులు అమ్మితే ప్రభుత్వం చాలా కఠినంగా వ్యవహరిస్తుందని అలాంటి దుకాణాలదారులపై కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం రైతులకు బిల్లులు ఇవ్వకుండా ఎరువులు విక్రయించకూడదన్నారు.

యూరియా పంపిణీ

మండల పరిధిలోని సాతనూరు గ్రామంలోని రైతు సేవా కేంద్రం ద్వారా 25.2 మెట్రిక్ టన్నుల యూరియాను మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ పంపిణీ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే యూరియా పంపిణీ జరిగిందన్నారు. యూరియాతో పాటు డీఏపీని కూడా అందుబాటులో తెచ్చామన్నారు.

విద్యుత్ స్తంభాలపై కేబుల్ తీగల తొలగింపు

ఎమ్మిగనూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలపై ప్రమాదకరంగా ఉన్న కేబుల్, ఇతర తీగలను శనివారం విద్యుత్ ఏఈ ప్రసన్న కుమార్ తన సిబ్బందితో కలిసి తొలగించారు. పట్టణంలోని సోమప్ప సర్కిల్, వైఎస్ఆర్ సర్కిల్, శివసర్కిల్, కూరగాయల మార్కెట్ సర్కిల్‌తో పాటు ఆయాప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలకు అడ్డంగా, ప్రమా దకరంగా ఉన్న కేబులు వైర్లుతో పాటు ఇతర వైర్లును తొలగించారు. ఈ విషయంపై ఏఈ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ విద్యుత్ స్థంబాలకు ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే కేబుల్ వైర్లతో పాటు ఇతర వైర్లు అమర్చుతున్నారని దీంతో విద్యుత్ స్థంబాలకు మరమ్మత్తులు చేసేందుకు ఇబ్బంది కరంగా, ప్రమాదకరంగా ఉంటుందన్నారు. దీంతోనే వైర్లను తొలగించామన్నారు. ఎవరికైనా అనుమతులు ఉంటే తమ కార్యాలయాన్ని సంప్రదించి వివరాలివ్వాలని సూచించారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి



జాబ్ మేళా పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మిగనూరు పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 26న నిర్వహించే జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సూచించారు. ఈ సందర్భంగా ఆయన శనివారం జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా అధికారి రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో 10కి పైగా బహుళ జాతీయ కంపెనీలు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు పదో తరగతి నుంచి ఏదైనా డిగ్రీ, బీటెక్, పీజీ చదివి, 18-35 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు ఇందుకు అర్హులని తెలిపారు. ఫ్రెషర్స్‌తో పాటు అనుభం కలిగిన అభ్యర్థులు కూడా హాజరు కావచ్చని తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఎంపిక అయిన అభ్యర్థులకు నెలకు రూ 12వేల నుండి 24 వే లు వరకు జీతం ఉంటుదని కావున ఆసక్తి గల నిరుద్యోగ యువతీ,యువకులు విద్యార్హత పత్రాలు జిరాక్స్, ఆధార్ కార్డు, రెస్యూమ్, రెండు ఫొటోలతో హాజరు కావాలని తెలిపారు. ఈ ఆవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 7799494856 నెంబర్‌ను సంప్రదించగలరన్నారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీనివాసులు

నందవరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర సాధ్యమౌతుందని తహసీల్దారు శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని గురుజాల గ్రామంలో ఎంపీడీవో పుల్లయ్య అధ్యక్షతన స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి, ప్రజలతో ప్రమాణం చేయించారు. సమావేశంలో ఏపీఎం రాఘవేంద్ర,ఎపీవో శ్రీనివాసులు, ఏఈ బాలకృష్ణ, గ్రామ పెద్దలు అమర్నాథ్‌రెడ్డి, అయ్యపురెడ్డి, పరమేష్, దేవరాజు, కార్యదర్శి రామారావు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

కౌతాళం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి వారికి భక్తులు శ్రావణ మాసంలో భాగంగా శనివారం అమవాస్య రోజు దేవాలయంలో చేపడుతున్న శాశ్వత అన్నదాన పథకానికి కర్నూలు జిల్లా సుంకేసుల గ్రామ వాస్తవ్యులు కురువ చిన్న రంగన్న కుటుంబ సభ్యులు రూ.50,005ల నగదును, ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి ఈ నగదును విరాళంగా ఆలయ కార్యాలయం నందు అందజేసినట్లు తెలిపారు. ఆలయ డిప్యూటీ కమీషనర్, ఈఓ వాణి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ముఖ్య అర్చకులు శివ కుమార్ స్వామి ఉన్నారు.

రైతు సేవా కేంద్రం తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ గీతా ప్రియదర్శిని

పెద్దకడబూరు , ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బసలదోడ్డి గ్రామంలోని తహశీల్దార్ గీతా ప్రియదర్శిని, వ్యవసాయ అధికారి సుచరితలు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి వచ్చిన యూరియా, వేరుశనగ వంటి ఇతర స్టాక్ వచ్చిన వివరాల, రైతులకు పంపిణీ చేసిన రికార్డులను పరిశీలించారు. రైతులు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తసుకోరావలన్నారు. వీఏవోలు రైతులకు అందుబాటలో ఉంటూ సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ జర్మియా పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్



స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ ర్యాలీలో కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : పరిశుభ్రతే ఆరోగ్యం, వర్షాకాలంలో మరింత జాగ్రత్త అవసరం అని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి అన్నారు. ఎమ్మిగనూరు పట్టణంలోని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి అధ్వర్యంలో తమ సిబ్బందితో కలసి స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్‌లో కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీ ఈ రాజునాయక్, మదన్ కుమార్, శరత్, శ్రీనివాసులు, సచివాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులు ఇవ్వాలి

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వ సెలవులు, గుర్తింపు కార్డులు, జాయినింగ్ లెటర్‌లు ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు నాగరాజు, సీఐటీయూ మండల అధ్యక్షులు గోవిందు డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్‌ల పత్రాన్ని కమిషనర్ గంగిరెడ్డి అందజేయగా ఇందుకు సానుకులంగా స్పందిచారన్నారు. ఈ కార్రమంలో ఇస్మాయిల్, సాల్మన్, రంగస్వామి, తిక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

'వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేయాలి'

గోనెగండ్ల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): 65ఏళ్ల పై పడిన వృద్ధులకు మండలంలోని ప్రతి గ్రామంలో రేషన్‌దుకాణ దారులు తప్పని సరిగా వారి ఇంటి దగ్గరకు వెళ్లి రేషన్‌సరుకులు అందజేయాలని లేని పక్షంలో వారిపై చర్యలు తీసకుంటామని తహసీల్దార్ రాజేశ్వరి అన్నారు. శనివారం మండల పరిధిలోని వేముగోడు గ్రామంలోని 1320017 రేషన్‌దుఖానం ను తనిఖీ చేశారు. స్టాక్ నిలువ ను పరిశీలించారు. అలాగే దుకాణంలో 65 ఏళ్ల పైపడిన వృద్ధులు ఎంత మంది ఉన్నారు. వారికి రేషన్‌సరుకులు అందజేశారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్డు దారులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా రేషన్‌పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సత్తాచాటిన గోనెగండ్ల అభ్యర్థులు



గుడిసె రాజశేఖర్



గొల్ల రాజశేఖర్

గోనెగండ్ల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): 2025 డీఎస్సీ ఫలితాలలో గోనెగండ్ల మండలంలోని ఇద్దరు విద్యార్థులు తమ సత్తాను చాటి జిల్లాలో 10 లోపు ర్యాంక్‌లను సాధించారు. గోనెగండ్ల కు చెందిన మద్దికేర పెద్దనాగన్న కుమారుడు గొల్లరాజశేఖర్ స్కూల్ అసిస్టెంట్ తెలుగులో జిల్లా లో 9వ ర్యా ంక్ సాధించాడు. అలాగే పీజీటీ లో 38వ ర్యా ంక్, టీపీటీలో 54వ ర్యాంక్ సాధించి తన సత్తాను చాటారు. అలాగే తిప్పనూరు గ్రామానికి చెందిన గుడిసే రాజశేఖర్ 2018లో ఏపీ రెసిడెన్సియల్ పాఠశాల అర్హత పొందాడు. అయితే 2025లో జరిగిన డీఎస్సీలో ఉమ్మడి జిల్లాలో ఇంగ్లీష్ విభాగంలో ఎస్ఏ లో 6వ ర్యాంక్ సాధించాడు. గ్రూప్స్ సాధించడమే తన లక్ష్యమని తెలిపారు.

రజత గజవాహనంపై ప్రహ్లాదరాయలు



రజత గజవాహనంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు రజత గజవాహనంపై పై భక్తులకు దర్శనం ఇచ్చారు. శనివారం శ్రావణమాస అమావాస్యను పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. . వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలి రావడంతో మంత్రాలయం పురవీధులన్నీ కిక్కిరిశాయి. నది తీరం, మధ్వమార్గ్ కారిడార్, అన్నపూర్ణ భోజనశాల, ప్రధాన రహదారులు, క్యూలైన్లు వద్ద భక్తులతో సందడిగా మారింది.

స్వర్ణ పల్లకిలో దర్శనమిచ్చిన రాఘవేంద్రుడు: పండితుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల మధ్య శ్రీ రాఘవేంద్రస్వామి స్వర్ణ పల్లకిలో భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం శ్రావణ మాస ముగింపు శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో మఠం దివాన్ శ్రీనాథ్ ఆచార్, అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.రాఘవేంద్రస్వామి బృందావన ప్రతిమను స్వర్ణపల్లకిలో అధిష్ఠించి అంగరంగ వైభవంగా ఊరేగించారు

● **దర్శించుకున్న తిక్కారెడ్డి:** దర్శనార్థం కర్నూలు టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి వచ్చారు. వీరికి ఆలయ మహా ముఖద్వారం వద్ద జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, అనంతపురాణిక్, జేపీ స్వామి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, ఫల, పుష్ప, వెండి గిన్నె, మంత్రాక్షితలు , పరిమళ ప్రసాదం ఇచ్చి సత్కారించారు. ఈ కార్యక్రమంలో ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, సురేష్ కోనాపూర్, ఎస్ఐ శివాంజల్, వ్యాసరాజ ఆచార్, టీడీపీ మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్వర్లు, అమర్‌నాథ్ రెడ్డి పాల్గొన్నారు.



శ్రీమఠంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి

హిందూ ధర్మం సనాతనమైనది



ఆలయంలో కుంకుమార్చన నిర్వహిస్తున్న భక్తులు

గోనెగండ్ల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): హిందు ధర్మం సనాతనమైనది అని ప్రతి ఒక్కరు ధర్మమును తప్పని సరిగా పాటిస్తే ఆ ధర్మము మిమ్ములను కాపాడుతుందని తిరుపతి తిరుమల దేవాస్థానం హిందు ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లువెంకటరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని ఒంటెడుదిన్నె గ్రామంలో ఆంజనేయ స్వామి దేవాయలయంలో తిరుపతి తిరుమల దేవాస్థానం హిందు ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కేశవరెడ్డి, ఉపేంద్రరెడ్డి, రామమోహన్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, సంజీవరెడ్డి, ఈశ్వర్, నాగేశ్వరప్ప, లక్ష్మికాంతారెడ్డి, జివీరాంరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వీరప్ప తోపాటు భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆలయ సిబ్బందిపై దాడి

కౌతాళం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్వామి దర్శనానికి తమ వారిని ఆలయ సిబ్బంది ఉత్తర ద్వారంలో వదలకపోవడంతో ఓ బ్యాంకు ఒప్పంద కూలీలు విధుల్లో ఉన్న సిబ్బందిపై దాడికి పాల్పడిన ఘటన శనివారం జరిగింది. ఆలయంలో శ్రావణ మాసంలో స్వామి వారికి సేవ చేసేందుకు ఆదోని ఇండియన్ బ్యాంకు వారు ఒప్పంద ప్రాతిపదికన కొందరిని దినసరి కూలీ ప్రకారం అక్కడ నియమించుకున్నారు. తమ బంధువులు స్వామి దర్శనానికి వస్తే బ్యాంకు చిరునామా గల గుర్తింపు కార్డులను వారికి ఇస్తూ నేరుగా లోపలికి పంపించే క్రమంలో ఆలయ సిబ్బంది లోపలికి అనుమతి లేదని చెప్పడంతో అక్కడ ఉన్న ఇద్దరు బ్యాంకు కూలీలు తమ వారినే వదలరా అంటూ సిబ్బందిపై దాడికి పాల్పడ్డారు. ఇది గమనించిన ఆలయ సిబ్బంది బంధువులు అక్కడికి చేరుకునేలోపు సదరు వ్యక్తులు అక్కడి నుంచి పారిపోయారు. అయితే జరిగిన ఘటనపై ఎలాంటి ఫిర్యాదులు చేయలేదు.

రైతులందరికీ యూరియా అందిస్తాం



యూరియా పంపిణీ చేస్తున్న సహకార సంఘం మండల అధ్యక్షుడు, ఏవో

నందవరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి రైతు భరోసా కేంద్రానికి యూరియా అందజేస్తున్నట్లు సహకార సంఘం మండల అధ్యక్షుడు ధర్మాపురం గోపాల్ తెలిపారు. శనివారం ముగతి, గురుజాల గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి సరిత ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు యూరియా, కాంప్లెక్స్ ఎరువులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలలో మొదట యూరియాను నేరుగా రైతులకు అదజేయాలని ఆదేశించారన్నారు.. పాసు పుస్తకం గల ప్రతి రైతుకు 3 సంచుల ప్రకారం యూరియాను ఇచ్చారు. పార్టీలకతీతంగా ప్రతి రైతుకు యూరియా అందజేస్తామని, రైతులకు యూరియా లోటు రానివ్వం అన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవీంద్రరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ కాశీంవలీ, ముగతి భార్గవ్‌యాదవ్, సత్యారెడ్డి, గుగ్గిరి నరసింహులు, కడుబూరి, కొండారెడ్డి, చంద్ర పాల్గొన్నారు.

ఘనంగా గుంటి రంగస్వామి రథోత్సవం



అలంకరణలో రథం

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వెంకటాపురం కాలనీలో కొలువుదీరిన గుంటి రంగస్వామి జాతర భక్తుల కొలాహలం మధ్య గోవింద నామస్మరణంతో కన్నుల పండువగా జరిగింది. ప్రతి ఏటా శ్రావణమాస చివరి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మిగనూరులోని షరాఫ్ బజార్‌లోని రామస్వామి దేవాలయం నుంచి సగరులు పల్లకిలో ఊరేగింపుగా తెచ్చిన ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉంచి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి భక్తజన సందోహాల నడుమ గురంటి రంగస్వామి రథోత్సవము గోవింద నామస్మరణలతో భక్తాదులందరూ కలసి రథాన్ని కొంత దూరం లాగి తిరిగి యధాస్థానాన్నికి చేర్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్ని ప్రత్యేకంగా పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

కనకవీడులో కార్డన్ సెర్చ్

నందవరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో సమస్యాత్మక గ్రామమైన కనకవీడులో శనివారం వేకువజామున ఎస్ఐ కేశవ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఎస్పీ భార్గవి ఆదేశాల మేరకు సీఐలు మధుసూదన్‌రావు, మంజునాథ్, శ్రీనివాసులు, విజయబాస్కర్, రామానుజులు ఎస్ఐలు వి.శ్రీనివాసులు, మదుసూదన్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, శివాంజల్, మల్లికార్జున, శరత్, రూరల్ శ్రీనివాసులు కలసి గ్రామంలో రౌడీషీటర్‌లు, వివిధ కేసుల్లో జైల్లో శిక్ష అనుభవించి వచ్చిన వారు, అనుమానితుల ఇళ్లలో సెర్చ్ చేసి రికార్డులు లేని, పత్రాలు చూపని ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. రౌడీషీటర్ల ఇళ్లలో తనిఖీలు చేసి అందరిని విచారించారు. కార్యక్రమంలో నందవరం, ఎమ్మిగనూరు టౌన్, రూరల్, మంత్రాలయం, మాదవరం, పెద్దకడుబూరు, కోసిగి, కౌతాళం మండలానికి చెందిన పోలీసులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



హెచ్. కైరవాడిలో పిల్లలతో హ్యాండ్ వాష్ చేయిస్తున్న దృశ్యం

గోనెగండ్ల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి వాటిని పెంచి పర్యావరణంను పరిరక్షించుకోవలసిన అవసరం అందరి పై ఉందని దీని పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదోని డివిజన్ డెవలప్మెంట్ అధికారి బాలకృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని హెచ్ కైరవాడి గ్రామంలో స్వచ్ఛా ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అందులో బాగంగా మాన్సూన్ హైజిన్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వచ్ఛా ఆంధ్ర కార్యక్రమం పై విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. అనంతరం గ్రామస్థులచే హ్యాడ్‌వాష్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ అనంతశయన, సింగిల్‌విండో ప్రెసిడెంట్ తిమ్మారెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోసిగి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మాన్‌సూన్ హైజీన్ కార్యక్రమంలో భాగంగా వర్షాకాలంలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై శనివారం ఎంపీడీవో ఈశ్వరయ్య స్వామి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, మాజీ సాగునీటి సంఘం అధ్యక్షులు పల్లెపాడు రామిరెడ్డి ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కోసిగి మేజర్ పంచాయతీ కార్యాలయం నుంచి పాఠశాలల బాలికల ఉన్నత విద్యార్థినులతో కలిసి ర్యాలీ నిర్వహించాఇ వాల్మీకి సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మాణిక్యరాజు, వక్రాణి వెంకటేష్, ఆర్లబండ సింగిల్ విండో చైర్మన్ నాడిగేని అయ్యన్న, మాజీ జడ్పీటీసీ రామకృష్ణ పాల్గొన్నారు

రైతులను ఆదుకోవాలి

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం, అధికారులు ఆదుకోవాలని రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఏసేపు డిమాండ్ చేశారు. యూరియా రైతులకు అందుబాటు లేకుండా వ్యాపారస్తులు ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నారన్నారు. దీని పైన ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకొని రైతులకు అందుబాటు ధరలకు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో శాంసంగ్, ఆనీఫ్, లాజర్ తదితరులు పాల్గొన్నారు.